ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

ఆదివారం | 25-10- 2026 | సంపుటి: 17, సంచిక: 204, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల

సాకారం చేస్తాం

న్యాయపరమైన చిక్కులు లేకుండా నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కటుబడి ఉంది

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 24 (ప్రజాకలం) :

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిన తర్వాత కూడా గతంలో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8వ తేదీన రవీంద్ర భారతిలో కార్యక్రమాన్ని నిర్వహించి భూమిని సొసైటీకి అప్పగించడం జరిగిందన్నారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రిగారు వెల్లడించారు. జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

తరువాయి 2వ పేజీలో...



పని చేయకపోతే పదవులు ఎందుకు?

- **పని చేయకుంటే.. పదవులకు రాజీనామా చేయండి**
- **పార్టీ పదవులు తీసుకుని ఇంటికే పరిమితమైతే ఎలా?**
- **ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పనిచేయాలి.. బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్**
- **ఎన్నికల్లో పోటీ చేయాలనుకునేవారు పార్టీ పదవులు వీడాలి**
- **ఆర్భాటాలు తగ్గించి ప్రజలతో మమేకం కావాలని సూచన**

హైదరాబాద్, అక్టోబరు 24 (ప్రజాకలం): పార్టీ పదవులు ఆశించే నాయకులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి చురుగ్గా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ స్పష్టం చేశారు. పదవులు తీసుకుని పనిచేయని వారికి ఆ పదవులు ఎందుకని ప్రశ్నించారు. పని చేయాలనే ఆసక్తి లేకుంటే వెంటనే పదవులకు రాజీనామా చేయడం మంచిదని ఆయన చురకలు అంటించారు. రాష్ట్ర ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ పదాధికారులతో ఆయన సమావేశమయ్యారు.

తెలంగాణ అంటే హైదరాబాద్ ఒక్కటే కాదు

తెలంగాణ అంటే హైదరాబాద్ ఒక్కటే కాదని బన్సల్ అన్నారు. నాయకులంతా ఇకపై నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల స్థాయికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు.

తరువాయి 2వ పేజీలో...


గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌళిక సదుపాయాల కల్పనకు

ప్రభుత్వం ప్రాధాన్యత

ప్రజలకు మెరుగైన రవాణా, విద్యుత్, త్రాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు : డిప్యూటీ సీఎం భట్టి

అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన డిప్యూటీ సీఎం



మధిర/చింతకాని, అక్టోబర్ 24 (ప్రజాకలం న్యూస్)

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాల కల్పనే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాల్లో రహదారులు, విద్యుత్, త్రాగునీటి సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిలతో కలిసి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు. చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలో రూ. 3.5 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, తిమ్మినేని పాలెం గ్రామంలో రూ. 8.25 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రామకృష్ణాపురం గ్రామంలో రామకృష్ణాపురం నుంచి కొత్తగూడెం వరకు దేవరపల్లి హైవేను కలుపుతూ రూ. 3 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రామకృష్ణాపురం నుంచి పెద్దగోపతి రోడ్డు వరకు రూ. 50 కోట్లతో చేపట్టనున్న రహదారి విస్తరణ, బలోపేతం పనులకు, కొదుమూరు గ్రామంలో వెంకటపాలెం నుంచి చింతకాని రోడ్డు వరకు రూ. 60 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా చేపట్టనున్న విస్తరణ, బలోపేతం పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. తిమ్మినేని పాలెం ఎస్సీ కాలనీలో రూ. 62 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, గాంధీనగర్ ఎస్సీ కాలనీలో రూ. 46 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు

అప్రమత్తంగా ఉండాలి

తాగునీటి సంరక్షణకు ప్రాధాన్యం

అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి

మనుషులతో పాటు పశుపక్షాదులను కాపాడుకోవాలి

ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి



ఆత్మకూరు: (ప్రజాకలం జిల్లా రిపోర్టర్)

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక, మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాబోయే ఎనిమిది నెలలు అత్యంత కీలకమని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో గ్రామాల్లో చెరువులు ఎండిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని, నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని కోరారు. ప్రైవేటు వ్యక్తుల బోర్లలో తాగునీరు అందుబాటులో ఉన్నా; ప్రభుత్వం తరఫున నీటిని కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు రైతులకు పంటల ఎంపిక, సాగు ప్రణాళిక, నీటి వినియోగంపై తగిన అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల

తరువాయి 2వ పేజీలో...

నాణ్యతతో మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం

పూర్తి చేయాలి

- **మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**
- **వైఎస్ఆర్ కాలనీలో ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్, ఇంటి పన్ను ధృవీకరణ పత్రం అందించాలి**
- **2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలి**

ఖమ్మం అక్టోబర్ 24(ప్రజా కలం న్యూస్)

నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో సుడా నిధులు రూ. 1.30 కోట్లతో చేపట్టనున్న ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, పాఠశాలలో నిర్మించనున్న



తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



పాలమూరు రైతాంగం గొంతు నులిమేలా డిండి లిఫ్ట్ కుట్రలు

కేసీఆర్ వేసిన 'డిండి ఉరితాడు'ను రేవంత్ బిగిస్తున్నారు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జీఓ 72 ప్రకారం పూర్తి చేయాలి

శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లోని ప్రతి నీటి బొట్టూ పాలమూరుకే దక్కాలి

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధ్వజం

హైదరాబాద్, అక్టోబరు 24 (ప్రజాకలం): పాలమూరు రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీసేలా డిండి లిఫ్ట్ ప్రాజెక్టును మళ్లీ తెరపైకి తీసుకురావడం దుర్మార్గమని మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌ఛార్జి డీకే అరుణ విమర్శించారు. పాలమూరు ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి పీఠం అధిరోహించిన రేవంత్‌రెడ్డి.. సొంత జిల్లా రైతాంగానికే అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.



కేసీఆర్ హయాంలో పాలమూరు రైతుల మెడకు వేసిన 'డిండి ఉరితాడు'ను ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి మరింత బిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులో భాగం కాని డిండి లిఫ్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జీఓ 72 ప్రకారమే ప్రాజెక్టు పూర్తి చేయాలి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల ఆశీర్వాదంతోనే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, ఈ విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలని డీకే అరుణ అన్నారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన జీఓ 72 ప్రకారం జూరాల ఆధారిత పాత డిజైన్‌తోనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాను మంత్రిగా పనిచేస్తూ పాలమూరు జిల్లా ప్రయోజనాల కోసం, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో జూరాల ఆధారంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సర్వేకు జీఓ 72 తీసుకొచ్చినట్లు ఆమె గుర్తుచేశారు.

కేసీఆర్ హయాంలో డిజైన్ మార్పు

తెలంగాణ ఏర్పడిన అనంతరం

తరువాయి 2వ పేజీలో...

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల

సాకారం చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా, అందరికీ ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

రూ.150 కోట్లతో మూడు మండలాల్లో శాశ్వత కరువు నివారణ చర్యలు

కరువు పరిస్థితులు ఎప్పుడు తలెత్తినా ప్రజలు, రైతులు తట్టుకునేలా రాష్ట్రంలోని మూడు మండలాల్లో 150 కోట్ల రూపాయిలతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, రైతు కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చారిత్రకంగా కరువు ప్రభావానికి గురవుతున్న ప్రాంతాలు, వర్షాధార వ్యవసాయం అధికంగా ఉన్న జిల్లాలు, సామాజిక-ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు, రైతు కుటుంబాల జీవనోపాధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి (ఎన్‌డిఎఫ్) సహకారంతో ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్లు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులతో మంత్రి గారు సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో కరువు-నిరోధక వ్యవసాయ విధానం అమలు, కరువు పీడిత ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార మార్గాల అన్వేషణ, ప్రతిపాదిత ప్రాజెక్టు కార్యాచరణ, నిధుల సమర్థ వినియోగం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ , నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతల, నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈమొత్తం ప్రాజెక్ట్‌కు ప్రకృతి విపత్తుల శాఖ పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ నోడల్ ఏజన్సీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని గ్రామ మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తోపాటు, వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు చేపడతారని తెలిపారు.

కరువు నివారణ ప్రాజెక్టు అమలులో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసుకోవాలని, ఎంపిక చేసిన మండలాల్లోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి లక్ష్యాన్ని చేరేలా, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు క్షేత్రస్థాయిలో నెరవేరుతాయని తెలిపారు.

మహిళలు, యువత, రైతులు, కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలు సహా సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. కరువు ప్రభావం ఒక్క వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ఉపాధి, కుటుంబ ఆదాయాలు, సంప్రదాయ వృత్తులపై కూడా పడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి వర్గానికి ప్రయోజనం చేకూరేలా, స్థానిక పరిస్థితులకు తగిన శాశ్వత పరిష్కారాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని మంత్రి స్పష్టం చేశారు. నిధుల వినియోగం, పనుల ఎంపిక, అమలు విధానం, క్షేత్రస్థాయి ఫలితాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. కేవలం నిధుల ఖర్చు, పనుల పూర్తితోనే ప్రాజెక్టు విజయాన్ని అంచనా వేయకుండా, ప్రజలకు ఎంత మేరకు ప్రయోజనం చేకూరింది, కరువు సమస్యను పరిష్కరించడంలో ఎంత పురోగతి సాధించామన్నది ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎన్. గోపి తదితర అధికారులు పాల్గొన్నారు

పాలమూరు రైతాంగం గొంతు నులిమేలా డిండి లిఫ్ట్ కుట్రలు

మొదటి పేజీ తరువాయి...

2015లో నాటి సీఎం కేసీఆర్ ఇంజినీర్ల నివేదికలను పక్కనపెట్టి ప్రాజెక్టు అప్రోచ్‌ను జూరాల నుంచి నార్లాపూర్ శ్రీశైలం బ్యాక్‌వాటర్‌కు మార్చారని డీకే అరుణ ఆరోపించారు. అనంతరం జీఓలు 105, 107లు తీసుకొచ్చి డిండి లిఫ్ట్‌కు పాలమూరు ప్రాజెక్టు నుంచి రోజుకు 0.5 టీఎంసీ నీటిని తరలించే ప్రయత్నం చేశారని అన్నారు. నాడు తాము ఎమ్మెల్యేలతో కలిసి పెద్దఎత్తున పోరాడి ఆ పనులను అడ్డుకున్నామని చెప్పారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం పాలమూరు రైతులకు ద్రోహం చేయడమేనని విమర్శించారు.

ప్రత్యామ్నాయ మార్గాలున్నా.. డిండి ఎందుకు?

నల్గొండలోని దేవరకొండ, మునుగోడు ఫ్లోరైడ్ ప్రాంతాల సమస్య పరిష్కారానికి పుట్టగండి లిఫ్ట్, ఎస్ఎల్‌బీసీ (ఏఎంఆర్ ప్రాజెక్టు), నక్కలగండి వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని డీకే అరుణ తెలిపారు. వాటి ద్వారా నీటిని తరలించడంపై ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. అయితే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో సంబంధం లేని డిండి లిఫ్ట్‌ను బలవంతంగా అనుసంధానించి, ఏదుల రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ల ద్వారా నీటిని తరలిస్తామనడం పాలమూరు రైతుల హక్కులను హరించడమేనని అన్నారు.

బ్యాక్‌వాటర్ నీరు పాలమూరుకే

శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి అదనంగా 0.6 టీఎంసీ కాదు.. ఒకటి, రెండు టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యం ఉన్నా ఆ నీటిని లక్షలాది ఎకరాలు బీడుగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాకే కేటాయించాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. డిండి ప్రాజెక్టు కాల్వల కారణంగా సుమారు 60 కిలోమీటర్ల మేర పాలమూరు భూములు, 30కి పైగా గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. నల్గొండ నాయకులు తమ ప్రాంత ప్రయోజనాల కోసం ఏకమవుతున్నప్పుడు.. పాలమూరు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

ప్రాజెక్టులు పడకేశాయ్

నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు దశాబ్దకాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని డీకే అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా రిజర్వాయర్లలో పూడిక తీయలేదని, మరమ్మతులు చేపట్టలేదని విమర్శించారు. ఆర్డీఎస్ కింద ఉన్న 15.9 టీఎంసీలు, జూరాల కింద ఉన్న 17.84 టీఎంసీల నీటి కేటాయింపులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక వరద నీటిని దిగువకు వదిలేస్తున్నారని ఆరోపించారు. జూరాల ప్యారలల్ ప్రాజెక్టు, వంతెన పనులకు నిధులు కేటాయించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

రాజీలేని పోరాటం

పాలమూరు పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గానికి సాగునీరు అందించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి ప్రారంభించేలా నాటి అసలు డీపీఆర్‌ను పునఃసమీక్షించాలని కోరారు. ముఖ్యమంత్రి పదవి ఎవరికీ శాశ్వతం కాదని వ్యాఖ్యానించిన ఆమె.. పాలమూరు రైతాంగ ప్రయోజనాలను విస్మరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పాలమూరు హక్కుల కోసం అవసరమైతే రాజీలేని ప్రజాపోరాటం చేపడతామని స్పష్టం చేశారు.

పని చేయకపోతే పదవులు ఎందుకు?

మొదటి పేజీ తరువాయి...

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమయం కేటాయించాలన్నారు.

ఎన్నికల్లో పోటీ చేయాలంటే పదవులు వీడాలి

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న నాయకులు పార్టీ పదవులను కొనసాగిస్తూ రెండింటినీ ఆశించకూడదని బన్సల్ స్పష్టం చేసినట్లు తెలిసింది. పార్టీ పదవులకు రాజీనామా చేసి తమకు ఆసక్తి ఉన్న నియోజకవర్గాలకు వెళ్లి ఇప్పటి నుంచే పనిచేసుకోవాలని సూచించారు.

చాయ్ తాగుతూ మాట్లాడితేనే ఎక్కువ ప్రభావం

సభలు, మైకులు, అనవసర ఆర్భాటాలకు ప్రాధాన్యం తగ్గించాలని బన్సల్ సూచించారు. భారీ బహిరంగ సభల్లో ప్రసంగించడం కంటే నలుగురితో కలిసి కూర్చుని చాయ్ తాగుతూ మాట్లాడితే ప్రజలపై మరింత ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. పార్టీ చేస్తున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లకపోతే వాటి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు.

ఆరోపణలకు ఆధారాలతోనే సమాధానం

పార్టీపై, పార్టీ నేతలపై అధికార, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని బన్సల్ సూచించారు. అందుకు వాస్తవాలు, ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జెన్-జీ ఉద్యమాల నేపథ్యంలో యువతతో నిర్వహించిన సెమినార్లు, చేపట్టిన కార్యక్రమాల వివరాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి

త్వరలో జరగనున్న రెండు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను నాయకులు సీరియస్‌గా తీసుకోవాలని బన్సల్ ఆదేశించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా చూడాలని సూచించారు.

కాషాయ జెండా ఎగరాలి

వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో కాషాయ జెండా ఎగరేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బన్సల్ పిలుపునిచ్చారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కంటే పార్టీ బలోపేతానికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తూ.. ప్రతి నాయకుడు ప్రజల్లో ఉండాలని స్పష్టం చేశారు.

ఎల్ నినో, కరవుపై బీఆర్ఎస్ విమర్శలకు కాంగ్రెస్ నేతల

కౌంటర్



హైదరాబాద్: ఎల్ నినో ప్రభావం, కరవు పరిస్థితులపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ నేతలు ఘాటుగా స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని పరిస్థితులను వివరిస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శలు గుప్పించారు. కరోనా సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మంత్రి అడ్లూరి ఆరోపించగా.. ఫామ్‌హౌస్‌లో కూర్చొని ప్రభుత్వంపై విమర్శలు చేయడం కేసీఆర్‌కు అలవాటుగా మారిందని వేముల వీరేశం మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతలు ఎల్ నినోపై బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టారు.

కేసీఆర్ ప్రభుత్వం విఫలమైంది: మంత్రి అడ్లూరి

కరోనా మహమ్మారి సమయంలో తన సొంత చెల్లిని కోల్పోయానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి ఉంటే తన చెల్లి ప్రాణాలతో ఉండేదని వ్యాఖ్యానించారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే కరోనా మందులు బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లాయని ఆరోపించారు. ఆ సమయంలో కనీసం మాస్కులు కూడా అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. మహమ్మారి సమయంలో కేసీఆర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కరోనా మరణాలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహిస్తారా? అని అడ్లూరి ప్రశ్నించారు. కరోనా సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీ హుందాగా వ్యవహరించిందని ఆయన పేర్కొన్నారు. కరవుకు కాంగ్రెస్ కారణమైతే, కరోనా సంక్షోభానికి బీఆర్ఎస్ కారణమా? అని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ నేతల విమర్శలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. ఎల్ నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపించే ప్రకృతి సంబంధిత పరిణామమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను రాజకీయాలతో ముడిపెట్టి విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి ప్రణాళికలు రూపొందిస్తున్నారని, విపత్తుల సమయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మంత్రి అడ్లూరి ధీమా వ్యక్తం చేశారు.

ఫామ్‌హౌస్‌లో కూర్చొని విషం చిమ్ముతున్నారు: వేముల వీరేశం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. ఫామ్‌హౌస్‌లో కూర్చొని ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. కరవుకు కాంగ్రెస్ కారణమని చెప్పే కేసీఆర్‌ను సైంటిస్టుగా అభివర్ణిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వ్యక్తి కేసీఆర్ అని ఆరోపించారు. కరోనా సంక్షోభానికి కేసీఆర్ కారణమని తాము చెప్పడం లేదని, అయితే కరవు పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరికావని వీరేశం వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో నీటి ప్రవాహానికి కేసీఆర్ కారణమని, కేసీఆర్ వల్లే ఏపీకి నీళ్లు వచ్చాయని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని వేముల వీరేశం పేర్కొన్నారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల విడుదలకు వేగంగా చర్యలు

- సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, అక్టోబరు 24 : కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల విడుదలకు వేగంగా చర్యలు చేపడుతున్నామని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వ్యాఖ్యానించారు. శనివారం కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, నిధుల సాధనపై సీఎస్ సంజయ్ జాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మార్గనిర్దేశం చేశారు. కేంద్ర నిధుల సాధనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన పెండింగ్ ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

కేంద్ర నిధుల విడుదలకు అవసరమైన ప్రక్రియలు వేగవంతం చేయాలి...

అలాగే, వ్యవసాయం నుంచి పట్టణాభివృద్ధి వరకు పలు శాఖలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్షించారు. కేంద్ర నిధుల విడుదలకు అవసరమైన ప్రక్రియలు వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వ్యయ వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాల ముగింపుపై సమీక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి రివ్యూ, డ్యాష్‌బోర్డులో నిధుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయా శాఖల కార్యదర్శులు తక్షణమే సమీక్షలు నిర్వహించాలని హుకుం జారీ చేశారు.

కేంద్రానికి డీఓ లేఖలు పంపిస్తాం..

కేంద్ర అదనపు కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. అవసరమైతే కేంద్రానికి డీఓ లేఖలు పంపిస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర కార్యదర్శులతో నేరుగా మాట్లాడతానని చెప్పుకొచ్చారు. తెలంగాణకు రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర నిధులు కీలకమని పేర్కొన్నారు. నిధుల సాధనలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం చేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌళిక సదుపాయాల కల్పనకు


ప్రభుత్వం ప్రాధాన్యత

మొదటి పేజీ తరువాయి...

ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మెరుగైన రహదారుల వల్ల గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమౌతుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ మౌళిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు అభివృద్ధి పనుల ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కొదుమూరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వేముల సతీష్, ప్రజాప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. తొలిసారి 30 డిగ్రీలు దాటిన

పసిఫిక్ మహాసముద్ర ఉష్ణోగ్రతలు..!



న్యూఢిల్లీ : పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గతంలో ఎన్నడూ లేనంత గరిష్ఠానికి చేరాయి. ఎల్‌నినో ప్రభావం పెరుగుతుండటంతో భూమధ్య రేఖకు సమీపంలోని మధ్య పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు తొలిసారి 30 డిగ్రీల సెల్సియస్ మార్కును దాటాయి. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 22న ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత 30 డిగ్రీలకు చేరినట్లు 'ఇండియా టుడే' తెలిపింది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం.. పసిఫిక్ మహాసముద్రంలో పగటి ఉష్ణోగ్రతలు ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ఉష్ణమండల ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ పరిణామం. దీనివల్ల సముద్రంపై వీచే గాలులు, మేఘాల కదలికలు, వర్షపాత నమూనాల్లో మార్పులు వస్తాయి. ఈ ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచంలోని పలు దేశాల వాతావరణం పైనా పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో కరువు, అధిక ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉండగా మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదల ముప్పు పెరుగుతుంది. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 అక్టోబర్-డిసెంబర్ మధ్య ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉంది. డిసెంబర్ నాటికి ఇది గరిష్ఠస్థాయికి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్‌నినో తీవ్రతను అంచనా వేయడానికి శాస్త్రవేత్తలు ఉపయోగించే నినో 3.4 సూచీలో సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణస్థాయి కంటే.. జూన్‌లో 1.6 డిగ్రీలు, ఆగస్టులో 2.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. అక్టోబర్-డిసెంబర్ కాలానికి ఈ వ్యత్యాసం 3.7 డిగ్రీలకు చేరవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేసింది. ఇది గతంలో నమోదైన గరిష్ఠస్థాయి కంటే ఎక్కువ. భారత్‌పైనా ఈ పరిణామాల ప్రభావం ఉండొచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2026లో నైరుతి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతంతో ముగిసింది. అక్టోబర్-డిసెంబర్ మధ్య దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మొత్తం మీద సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపింది. అయితే ప్రాంతాలవారీగా పరిస్థితులు మారవచ్చని, ఎల్‌నినో ఒక్కటే భారత వాతావరణాన్ని నిర్ణయించదని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

నాణ్యతతో మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి...

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు, మూడు వారాలకు ఒకసారి పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ మీటర్లు అందించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కాలనీలో ఇళ్లలో నివసిస్తున్న వారికి ఇంటి పన్ను ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో నివసించే ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం విద్యుత్ సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు. 2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అంశాలపై సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సంబంధిత అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు

అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి...

ఎదురయ్యే పరిస్థితులపై ప్రజలకు స్పష్టంగా వివరించి, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భరోసా ఇచ్చారు. రైతులకు, గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం మనుషులపైనే కాకుండా పశుపక్షాదులపైనా పడే అవకాశం ఉన్నందున వాటి సంరక్షణకు కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకుని, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తే రాబోయే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్ డి ఓ సుబ్రహ్మణ్యం,ఎంఆర్ఓ, ఎండిఓ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా వైద్య కళాశాల

నిర్మాణ పనులు పూర్తి చేయాలి









జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 24 (ప్రజా కలం): నిర్ణీత గడువులోగా వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జగిత్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా పూర్తి చేయాల్సిన పనుల వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే వైద్య కళాశాల భవనంతో పాటు హాస్టల్ బ్లాక్, కిచెన్, తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి, వాటి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. హాస్టల్ బ్లాక్, కిచెన్, తరగతి గదులతో పాటు కళాశాలకు సంబంధించిన అన్ని నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో వైద్య విద్య అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి, అవసరమైన అన్ని వసతులతో కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడం ప్రజలకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే జిల్లాలోని విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేందుకు మెరుగైన అవకాశాలు లభించడంతో పాటు, ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. భవన నిర్మాణ పనులతో పాటు విద్యార్థులకు అవసరమైన హాస్టల్, కిచెన్, తరగతి గదులు తదితర మౌలిక వసతులను నాణ్యతతో ఏర్పాటు చేయాలని తెలిపారు. నిర్మాణ పనుల విషయంలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాల త్వరితగతిన అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సంబంధిత శాఖల అధికారులు, వైద్య కళాశాల నిర్మాణ పనులకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

బండలింగాపూర్‌లో ఆర్మీ సైనికుడిపై దాడి



14 మంది అరెస్ట్ - 14 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, స్టీల్ కడియం స్వాధీనం

మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు వెల్లడి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 24 (ప్రజా కలం) ఇబ్రహీంపట్నం మండలం బండలింగాపూర్‌లో ఆర్మీ సైనికుడిపై దాడి చేసిన కేసులో 14 మంది అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు మెట్ పల్లి సిఐ సురేష్ బాబు తెలిపారు. బండలింగాపూర్ గ్రామంలో ఆర్మీ సైనికుడు తిగుర్ల స్వామిపై దాడి చేసిన కేసులో 14 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 14 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, ఒక స్టీల్ చేతి కడియాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మెట్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సురేష్ బాబు వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 22 రాత్రి వెల్లుల్ల గ్రామానికి చెందిన వన్నెల వికాస్‌పై బండలింగాపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేశారనే కారణంతో వికాస్ స్నేహితులు సుమారు 30 మంది గుంపుగా ఏర్పడి ద్విచక్ర వాహనాలపై బండలింగాపూర్‌కు వెళ్లారని వివరించారు. అక్టోబర్ 23 తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలో బతుకమ్మ ఆడుతున్న వారి పక్క నుంచి యువకులు వేగంగా, నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. దీంతో అక్కడే ఉన్న ఆర్మీ సైనికుడు తిగుర్ల స్వామి వారిని ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుందన్నారు. ఈ క్రమంలో కొందరు ఆయనపై దాడి చేయడంతో పాటు స్టీల్ చేతి కడియంతో ముఖంపై కొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో స్వామికి తీవ్ర రక్తగాయమైందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, అక్టోబర్ 24 ఉదయం మేడిపల్లి గ్రామ శివారులోని ఇబ్రహీంపట్నం ఎక్స్‌రోడ్డు వద్ద వెల్లుల్ల గ్రామానికి చెందిన 14 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.అనంతరం వారిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారన్నారు. ఈ కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉండగా,బావు రమేశ్,తుపాకుల స్వామి, బావు అఖిల్,లక్కంపల్లి కార్తీక్,మర్రి నీరజ్, లక్కంపల్లి కళ్యాణ్,ఐలేని వంశీ, కల్లూరి మహేశ్, కల్లూరి వంశీ, కాంతి విశాల్, బొబ్బిలి నాగరాజ్, పోచంపల్లి సాయి, మంచాల పవన్,కల్లూరి రవి లను రిమాండ్ కు తరలించామని పేర్కొన్నారు. **యువత ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి.మెట్ పల్లి సీఐ బి. సురేష్ బాబు. ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి. నవీన్ కుమార్.**

యువత ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని మెట్ పల్లి సీఐ బి. సురేష్ బాబు, ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి. నవీన్ కుమార్ లు సూచించారు. యువత అర్ధరాత్రి వేళల్లో గుంపులుగా తిరుగుతూ గొడవలు, దాడులకు పాల్పడితే వారి భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో ఉంటున్నారు అనే విషయాలపై నిఘా ఉంచాలని, చెడు స్నేహాలకు దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ వంటి ప్రక్రియలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.
యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

తక్కువ నీటితో సాగయ్యే పంటలు వేసుకోవాలి



గొల్లపల్లి అక్టోబర్ 24 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలోని ఇస్రాజుపల్లె గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బొట్ల కరుణ మాట్లాడుతూ, రైతులు పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ భూసారాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఎరువులు, పురుగుమందులను అవసరానికి అనుగుణంగా సమతుల్యంగా వినియోగించి సాగు ఖర్చులను తగ్గించుకోవాలని తెలిపారు. ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో యాసంగిలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే మొక్కజొన్న, పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు, కూరగాయల పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ,వార్డు సభ్యులు ఏఈఓ మహేష్, సీఆర్పీ స్రవంతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఖేతీ బచావో అభియాన్‌లో

రైతులకు అవగాహన



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 24(ప్రజా కలం ప్రతినిధి)

జగిత్యాల జిల్లాఇబ్రహీంపట్నం: ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, ఈ ఖరీఫ్ సీజన్‌లో నమోదైన తక్కువ వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత తగ్గడం, అక్టోబర్ నెలలోనూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఇబ్రహీంపట్నం మండలంలో నిర్వహించిన ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆరుతడి పంటల ప్రాముఖ్యత, నీటి పొదుపు పద్ధతులు, పంటల మార్పిడిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వరి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరమవుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి లభ్యత సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపారు. రైతులు తమ భూముల స్వభావం, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని కంది, పెసర, మినుము, శనగ, జొన్న, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఆరుతడి పంటల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు, సాగు ఖర్చులను నియంత్రించుకొని భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఏడీఏ డి. రమేష్, మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, సర్పంచ్ బండి రాజేష్, వ్యవసాయ విస్తరణ అధికారి సాగర్, ఉద్యానవన విస్తరణ అధికారి శ్రీలత మరియు రైతులు పాల్గొన్నారు.

అటవీ సరిహద్దు వివాదాలు పరిష్కరించాలి

భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి రీ సర్వే చేపట్టాలి

భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్




జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 24(ప్రజా కలం) అటవీ సరిహద్దు వివాదాలను పరిష్కరించి, భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు.శనివారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూముల రీ సర్వే పురోగతి, బృందాల ఏర్పాటు, అటవీ సరిహద్దు వివాదాలు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జగిత్యాల సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అటవీ సరిహద్దు వివాదాలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రీ సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులకు కూడా వారి భూముల్లో సర్వే నిర్వహించే తేదీలను ముందుగానే తెలియజేసి, వారు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రీ సర్వే సందర్భంగా క్షేత్రస్థాయి రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.రీ సర్వే పనులకు అవసరమైన అదనపు రోవర్ పరికరాలను ప్రభుత్వం తగిన సంఖ్యలో సమకూరుస్తుందని తెలిపారు. భూ భారతి తరహాలో రీ సర్వే కోసం ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సిబ్బంది, పరికరాలను సమర్థంగా వినియోగించుకొని పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు, కలెక్టరేట్ ఏవో కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలి

- పుష్కరాల ప్రత్యేక అధికారి,దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు

పెద్దపల్లి,అక్టోబర్ 24:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని మౌలిక వసతులు కల్పించాలని పుష్కరాల ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్లను,ఏర్పాట్ల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కర ఘాట్ల అభివృద్ధి, పారిశుద్ధ్యం,తాగునీరు, విద్యుత్, రోడ్లు మరియు భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తుల రద్దీకి తగ్గట్లుగా స్నానఘట్టాలు, రాకపోకల మార్గాలను సిద్ధం చేయాలని, అవసరమైన పనులకు తక్షణమే ప్రతిపాదనలు రూపొందించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.అనంతరం కలెక్టర్‌తో కలిసి మంథనిలోని గౌతమేశ్వర,ఓంకారేశ్వర, సురబండేశ్వర,మహాలక్ష్మి,లక్ష్మీనారాయణ తదితర ఆలయాలను సందర్శించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, ఆర్డీవో సురేష్,మున్సిపల్ కమిషనర్ మనోహర్,దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కులగణనలో బీసీ కాలాన్ని పెట్టాలి

తెలంగాణ కాంగ్రెస్ (ప్రభుత్వం)ఇచ్చిన మూడు డిక్లరేషన్లను అమలు చెయ్యాలి

: బిఎల్ఎఫ్ నాయకుల డిమాండ్

బెల్లంపల్లి, అక్టోబర్ 24, (ప్రజాకలం) ప్రతినిధి : మంచిర్యాల జిల్లా కేంద్రం లో జరిగే బిఎల్ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశాని జయప్రదంచేయాలని శనివారం బెల్లంపల్లి ఎంసిపిఐయు పార్టీ కార్యాలయం లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) సమావేశం పసులేటి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు.. ఈ సందర్భంగా నాయకులు, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సంకె రవి, సబ్బని రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో 12/10/2026 న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం పిలుపులో భాగంగా 2026 నవంబర్ 01 న మంచిర్యాల జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కులగణనలో బీసీ కాలాన్ని పెట్టకుండా బీసీ ల జనాభా,ఆర్థిక, సామాజిక,రాజకీయ లెక్కలు తియ్యడం లేదు.దీనివలన బీసీలు భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉన్నదని.బీసీ కాలాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు.అదేవిదంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతు,బిసి,ఎస్సీ,ఎస్టి,డిక్లరేషన్లు చేసి అధికారంలోకి వస్తే మూడు డిక్లరేషన్లను అమలు చేస్తామణి హామీ ఇచ్చిందని అధికారంలోకి వచ్చి నేటికీ 3 సం.రాలు దాటిపోతున్న ఇచ్చిన డిక్లరేషనలను అమలు చెయ్యడం లేదన్నారు.



వాటిని మూలకు పడేయ్యడం జరిగిందని,బీసీ కాలాన్ని చేర్చాలని, మూడు డిక్లరేషన్లు అమలు చేయాలని కేంద్ర, ప్రభుత్వంపై ఒత్తిడి తిసుకురావడం కోసం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. సామాజిక సంస్థలు,నాయకులు, ఆలోచన పరులు హాజరు కావాలని బిఎల్ఎఫ్ పిలుపునిచ్చింది.ఈ సమావేశంలో బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సంకె రవి, బిఎల్ఎఫ్ నాయకులు సబ్బని రాజేంద్ర ప్రసాద్,పసులేటి వెంకటేష్, కన్నూరి సమ్మయ్య,తోగరి రాహులు,జెంజర్ల శేఖర్,శంభోజీరాజేష్,శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు...

ప్రజా కలం
ఆదివారం, అక్టోబర్ 25, 2026

మళ్లీ తెరపైకి డీలిమిటేషన్

దేశ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఇరాన్ యుద్ధం వలన దేశం లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో కేంద్రంలోని పాలక, ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలకు వదును పెడుతున్నాయి. దురదృష్టవశాత్తూ జెన్ జీలకు కూడా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టడం లేదు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ఒకవైపు సిజెపి, మరోవైపు ఇండీ కూటమి ఎన్డిఎ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని కొనసాగిస్తూ, నిరసనలతో దేశ రాజధానిలోను, ఇతర రాష్ట్రాల్లోను తమ ఆందోళనలను ఉధృతం చేస్తుండగా, మరొక వైపు కేంద్ర ప్రభుత్వం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇంతకు ముందే జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి, కాక్రోచ్‌లు నిర్వహించిన ఉద్యమానికి స్పందించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి, సోనమ్ వాంగ్‌చుక్ చేత నిరాహార దీక్ష విరమింప చేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలపై మరోసారి ఒత్తిడి పెంచి, ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్ చేత రాజీనామా చేయించాలని వైరి పక్షాలు పట్టుబడుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బొద్దింకల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం సిఇసి విషయంలో తలెత్తిన నిరసన జ్వాలలను పట్టించుకోవడం లేదు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిజెపి, ప్రతిపక్షాల ఆందోళనలను అణచివేయడానికే ఎన్డిఎ ప్రభుత్వం మొగ్గ చూపడం గమనార్హం. ప్రత్యర్థుల ఆందోళనలకు లొంగిపోతే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా తాము వారు చేసిన ఆరోపణలను అంగీకరించినట్టే అవుతుందని భావించి ఉండవచ్చు. అందుకే ఈ నిరసనలను పట్టించుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డీలిమిటేషన్ బిల్లుతోపాటు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ బిల్లులు ప్రస్తుతం జరుగుతున్న సిజెపి, విపక్షాల నిరసనల నుండి దారి మళ్ళించడానికా? లేక ప్రతిపక్షాలు మహిళల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో దురభిప్రాయం కలిగించడానికా? అనే అంశాలను పక్కనబెడితే డీలిమిటేషన్ బిల్లును, మహిళల రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టి, తాము అనుకున్న లక్ష్యం సాధించడానికే నన్నద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేక గళం వినిపించిన స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రస్తుతం ఎన్డిఎకు దగ్గరవుతున్న సూచనలు అగుపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుండి చీలిన పలువురు ఎంపిలు, ఇతర పార్టీలకు చెందిన సభ్యులు ఈ బిల్లులను గట్టెక్కించడంలో సహకరిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, పార్లమెంటు లోను, కేంద్రంలోను దక్షిణాది రాష్ట్రాల ప్రాభవం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయనే వాదన సత్యదూరం కాదు. అయితే లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల చట్టసభల సీట్లను 50 శాతం పెంచి పునర్విభజన చేపట్టడం కొంతలోకొంత ఉపశమనం కలిగించే చర్య అయినప్పటికీ, ఇది పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగించే చర్య మాత్రం కాబోదు. ప్రతిపక్షాలు సూచించిన విధంగా డీలిమిటేషన్ బిల్లు పక్కన బెట్టి, ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి కేంద్రం అంగీకరించదు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల విషయంలో అధికంగా లబ్ధి పొందుతాయి. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది ప్రాబల్యం పెరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, తీవ్ర వివక్షకు గురయ్యే అవకాశాలున్నాయి. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, ఇప్పటికే కేంద్రం దక్షిణాది రాష్ట్రాలనుండి అధిక మొత్తంలో పన్నులు గుంజి, దక్షిణాదికి లాంఛనంగా నాలుగు మెతుకులు విదుల్చుతూ, ఉత్తరాదికి మేలు చేస్తున్నదనే వాదన విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు జోరందుకోవడంతో అప్రమత్తమైన కేంద్రం అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచుతామని ప్రకటించింది. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లులో ఈ విషయమై స్పష్టత కొరవడిందని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ గతంలోనే నిలదీసింది. అయితే గతంలో ప్రవేశపెట్టిన బిల్లులోని అంశాలను మారుస్తారా? లేక యథాతథంగా బిల్లును ప్రవేశపెడతారా? కాంగ్రెస్ కోరినట్టు ప్రతిపక్షాలతో సంప్రదిస్తారా? అనే విషయాలపై సందిగ్ధత తొలగితే కాని, ఈ అంశంపై పూర్తి స్థాయిలో స్పష్టత రాదు. చట్టాలుతెలుసుకోండి మరిన్ని కనుగొనండి చట్టాలు తెలుసుకోండి పథకాలు చూడండి రాజకీయాలు చూడండి ప్రస్తుతం దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌కు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు లోక్‌సభ లో 55 సీట్ల వ్యత్యాసముంది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ విషయంలో 63 సీట్ల వ్యత్యాస ముంది. తమిళనాడుతో పోల్చిచూస్తే ప్రస్తుత యుపి లోక్ సభ సీట్లు 41 సీట్లు అధికం. జనాభా ప్రాతిపదికన కాకుండా అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచితే ఆంధ్ర, యుపిల మధ్య 82 సీట్లు, తెలంగాణాతో పోల్చి చూస్తే 94 సీట్లు, తమిళనాడు, యు.పి ల మధ్య 61 సీట్ల వ్యత్యాసముంటుంది. ఏ విధంగా చూసినా పెద్ద రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుండి 816కు పెంచడం వలన పెరిగే లోక్‌సభ సభ్యుల సంఖ్య వలన ప్రభుత్వ ఖజానాపై మరింత భారం పడే అవకాశముంది. ఇక రాష్ట్రాల్లో పెరిగే శాసన సభ్యుల సంఖ్య వలన కూడా విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. ఈ భారాన్ని ప్రజల మీద మోపడం భావ్యమా? ఇప్పటికే సామాన్య ప్రజలపై వివిధ మార్గాల్లో ప్రభుత్వాలు ఆర్థిక భారం మోపుతున్నాయి. పెద్ద పెద్ద నియోజకవర్గాలను విభజించి, అధికార వికేంద్రీకరణ చేయడం సముచితమే. అయితే ప్రభుత్వ నిర్ణయాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నా లుక ఊడిన చందంగా పరిణమించరాదు. డీలిమిటేషన్ హేతుబద్ధంగా జరగాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య విభేదాలు తలెత్తకూడదు. డీలిమిటేషన్‌పై లోతైన మేధోమథనం జరగాలి. తీవ్రమైన కసరత్తు జరగాలి. అందరికీ ఆమోదయోగ్యం పద్ధతిలో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలి.

యువతకు ఉపాధి ప్రకృతి పరిరక్షణే లక్ష్యం



- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,అక్టోబర్ 24:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు జిల్లాలోని చారిత్రక, సహజసిద్ధ సంపదను కాపాడుకోవాలని పెద్దపల్లి జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు.శనివారం సమీకృత కార్యాలయ సముదాయం లో అగ్నివీర్,కేంద్ర బలగాల ఉద్యోగార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం మరియు మన జిల్లా – మన ఖిల్లా ఆధ్వర్యంలో చేపట్టనున్న సీతమ్మలోద్ది కొండల నడక ప్రచార వత్రాలను ఆయన ఆవిష్కరించారు.సైనిక నియామకాల్లో భాగంగా నిర్వహించే దేహదారుఢ్య పరీక్షల అనంతరం ఎదురయ్యే చిన్నపాటి ఆరోగ్య సమస్యలను ముందే గుర్తించేందుకు ఈ నెల 31న పెద్దపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రాంగణంలో యువశక్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.ఆసక్తి గల అభ్యర్థులు 7780543055, 9182691655 సంఖ్యల ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు.అలాగే నవంబర్ 1న ప్రాచీన గుహలు, సహజసిద్ధ అందాలు కలిగిన సీతమ్మలోద్ది, పిడుగుతొర్ర, భీమన్న ఆలయాల సందర్శనార్థం కొండల నడక కార్యక్రమం జరగనుంది.ఇప్పటికే 250 మంది పేర్లు నమోదు చేసుకున్న ఈ యాత్రలో పర్యావరణ పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల నివారణపై జీవితానికి సై – మత్తుకు నై అనే నినాదంతో యువతకు చైతన్యం కలిగించనున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రవీణ్ రెడ్డి,అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి,ఛాయాగ్రాహకులు రవీందర్ రెడ్డి,శీలం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగాలు కల్పించాలి

డిసెంబర్ లో ప్రారంభం కానున్న ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ

ప్రధాని మోదీ స్థానికులకు ఉపాధిపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

రైతుల సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి

తెలంగాణ ఎమ్మార్పీఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేరిపోతుల విల్సన్ మాదిగ

అక్టోబర్ 24 హనుమకొండ:- (ప్రజాకలం ప్రతినిధి)

కాజీపేట అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు, స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్టీ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేరిపోతుల విల్సన్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు న్యాయం చేయడంతోపాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించడంతోపాటు, బాధిత కుటుంబాల్లో అర్హులైన వారికి ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని గతంలో హామీలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటి నుంచి ప్రారంభోత్సవం వరకు ఎన్నో సంవత్సరాలుగా రైతులు, స్థానికులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం వెలువడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం తెలంగాణ రైల్వే జేఏసీ, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు శాంతియుత ర్యాలీలు, పాదయాత్రలు, ధర్నాలు నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన మంత్రులు, రైల్వే అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు కాజీపేటకు వచ్చిన ప్రతిసారీ భూములు కోల్పోయిన రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి డిసెంబరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విచ్చేయనున్న నేపథ్యంలో, ఈ ప్రాంత ప్రజల చిరకాల సమస్యను పరిష్కరించాలని విల్సన్ మాదిగ విజ్ఞప్తి చేశారు. కోచ్ ఫ్యాక్టరీతో తమ గ్రామానికి, ప్రాంతానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తున్నప్పటికీ, ఫ్యాక్టరీ కోసం భూములు త్యాగం చేసిన రైతులు మాత్రం ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు, స్థానిక నిరుద్యోగ యువతకు ప్రాధాన్యతనిస్తూ ఉద్యోగాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కోచ్ ఫ్యాక్టరీ ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి లభించినప్పుడే ఈ ప్రాంత అభివృద్ధికి నిజమైన అర్థం చేకూరుతుందని జేరిపోతుల విల్సన్ మాదిగ పేర్కొన్నారు.



తోటి ఫోటోగ్రాఫర్ కుటుంబానికి జిల్లా ఫోటోగ్రాఫర్ల ఆపన్నహస్తం!

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుమంత్ కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 24 (ప్రజా కలం):

తోటి ఫోటోగ్రాఫర్ అకాల మరణంతో విషాదంలో మునిగిన కుటుంబానికి అండగా నిలిచి జిల్లా ఫోటోగ్రాఫర్లు మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో మేమున్నామంటూ భరోసా కల్పించి, ఆపన్నహస్తం అందించారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ సుమంత్ ఈ నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన అకాల మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. ఈ నేపథ్యంలో సుమంత్ కుటుంబాన్ని ఆదుకునేందుకు జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ముందుకొచ్చింది. జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో శనివారం ఫోటోగ్రాఫర్లు సుమంత్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.15,000 ఆర్థిక సాయాన్ని అందజేసి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని భరోసా కల్పించారు.

వృత్తిలోనే కాదు.. కష్టసుఖాల్లోనూ మేమంతా ఒక్కటే!

తోటి వృత్తి సభ్యుడి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్లు కేవలం వృత్తిపరమైన సహచరులే కాకుండా, ఒకరి కష్టాన్ని మరొకరు తమ కష్టంగా భావించే కుటుంబ సభ్యులని ఈ సహాయ కార్యక్రమం చాటిచెప్పింది. ఆర్థిక సాయం అందించడం ద్వారా జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ తమ ఐక్యతను, సేవాభావాన్ని చాటుకుంది. ఈ కార్యక్రమంలో బీచుపల్లి, రంగన్న, వేణు, సత్యం, బతుకన్న, నరసింహులు, శివ, అశోక్, ప్రవీణ్ తదితర ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఛాంగ్-టా మార్షల్ ఆర్ట్స్‌లో ఐపీఎస్ విద్యార్థుల ప్రతిభ

- విజేతలను అభినందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష




సుల్తానాబాద్,అక్టోబర్ 24:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఛాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు.వివిధ విభాగాల్లో రాణించి స్వర్ణ,రజత,కాంస్య పతకాలు కైవసం చేసుకున్న క్రీడాకారులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేకంగా అభినందించారు.ఈ పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో మనోజ్ కార్తి (-48 కిలోలు),అండర్-14 బాలికల విభాగంలో సనా తబసూమ్ (-41 కిలోలు) బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితో పాటు అండర్-17 విభాగంలో సంప్రిత్ (-52 కిలోలు),అద్వైత్ (-56 కిలోలు),సాత్విక్ (-75 కిలోలు),కృషిక (-75 కిలోలు) రజత పతకాలు సాధించగా,శ్రీ వర్షిణి (-48 కిలోలు) కాంస్య పతకం గెలుచుకున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో పాటు పతక విజేతలను కలెక్టర్ ప్రశంసిస్తూ,ముమ్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఘనతపై పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్,ప్రిన్సిపల్ కృష్ణప్రియ,వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ,సతీష్ హర్షం వ్యక్తం చేశారు.

భూ రీసర్వే పనులను వేగవంతం చేయండి

- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్



పెద్దపల్లి,అక్టోబర్ 24 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి): రాష్ట్రంలో చేపట్టిన మొదటి దశ భూ రీసర్వే పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం భూ రీసర్వే పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.పెద్దపల్లి ఐడీఓసీ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రెవెన్యూ అదనపు కలెక్టర్ బీ.శ్రీరాములు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ మాట్లాడుతూ మొదటి దశలో భాగంగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చోట అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని,సిబ్బందికి తగిన సాంకేతిక శిక్షణ అందించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో భూ సరిహద్దులు,రికార్డుల వ్యత్యాసాలకు సంబంధించి ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ,భూయజమానులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.అధునాతన సాంకేతిక పరికరాలు,యంత్రాల కొరత లేకుండా ముందుగానే సమకూర్చుకొని,రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు గ్రామాల వారీగా రోజువారీ పురోగతిని నిరంతరం సమీక్షించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఏడీ సర్వేయర్ సోమేశ్వర్, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాధిత ప్రజలకు అండగా నిలుస్తాం

-కల్లపెల్లి విజయసాగర్ -మానవ హక్కుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయసాగర్ నియామకం



పెద్దపల్లి,అక్టోబర్ 24:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

వినియోగదారుల మరియు మానవ హక్కుల పరిరక్షణ,ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ప్రతిష్టాత్మక సంస్థ ఉపభోక్త ఏవం మానవ అధికార్ రక్షా సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లపెల్లి విజయసాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షులు ఆర్.కె. జైన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహోరా బాను సూచనలు,సలహాల మేరకు జాతీయ నాయకత్వం ఈ నియామకాన్ని ఖరారు చేసింది.ఈ సందర్భంగా నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లపెల్లి విజయసాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ,రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ,పోలీస్ లేదా ఇతర అధికార యంత్రాంగం సకాలంలో స్పందించని పక్షంలో సంస్థ తరఫున బాధితులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.ప్రజల గోడును,సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,వారితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వినియోగదారుల హక్కులు,మానవ హక్కులపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామని,బాధితులకు న్యాయం జరిగేలా సంస్థ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



పెద్దపల్లి, అక్టోబర్ 24 (ప్రజాకలం జిల్లాప్రతినిధి):

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు గోల్డెన్ అవర్ లో తక్షణ వైద్యం అందించి ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో నిమిత్తం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.ఈ పథకం కింద ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని,అవసరమైతే ఆపై ఖర్చును ఆరోగ్యశ్రీ కింద కొనసాగించాలని తెలిపారు.దీని ద్వారా ఏటా దాదాపు రూ.100 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులు ఆదా అవుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు కావాలని, ప్రమాద వివరాలను ఈ-డీఏఆర్ పోర్టల్‌లో నమోదు చేసి 24 గంటల్లోగా పోలీసులు ధ్రువీకరించాలని ఆదేశించారు.దీని పర్యవేక్షణకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు.కలెక్టర్లు పెండింగ్ క్లెయిమ్‌లను వేగంగా ఆమోదించి ఆసుపత్రులకు చెల్లింపులు జరిగేలా చూడాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంతో పాటు నెక్ట్‌జెన్ ఎం-పరివాహన్ యాప్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎస్ సూచించారు.

పచ్చదనమే ప్రగతికి పునాది.. మొక్కలు నాటిన గోనుపాడు సర్పంచ్!

పర్యావరణ పరిరక్షణకు గ్రామపంచాయతీ ముందడుగు



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 24 (ప్రజాకలం):జోగులాంబ గద్వాల జిల్లా గోనుపాడు గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో వి.బి.-జి-ఆర్ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామసర్పంచ్ శ్రీమతి జి. రాములమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొక్కలు నాటి వర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాలిటెక్నిక్ కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

తాగునీటి నాణ్యతపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు!

జూరాల మిషన్ భగీరథ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 24 । ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీటిని అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. తాగునీటి నాణ్యత పరీక్షలను నిరంతరం నిర్వహిస్తూ, ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని స్పష్టం చేశారు. శనివారం జూరాల ప్రాజెక్టు వద్ద ఉన్న మిషన్ భగీరథ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి ప్రక్రియ, సిబ్బంది హాజరు, నిర్వహణ రికార్డులను పరిశీలించారు. నీటి శుద్ధి, సరఫరా ప్రక్రియలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే అక్రమ నీటి కనెక్షన్లను అరికట్టాలని, తాగునీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన తాగునీరు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో తాగునీటి నాణ్యత అత్యంత కీలకమని, ఈ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

ఎల్ నినో ముప్పు.. నీటి సంరక్షణే మనకు రక్ష

హైదరాబాద్ అక్టోబర్ 24 (ప్రజాకలం):

వేసవి ఇంకా రాకముందే నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం, వర్షపాతంలో అనిశ్చితి, భూగర్భ జలమట్టాల తగ్గుదల వంటి పరిణామాలు నీటి వనరులపై ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. అందువల్ల భయాందోళనలకు లోనుకాకుండా, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. నీటి కొరత అనేది కేవలం రైతుల సమస్య కాదు. ప్రతి కుటుంబానికి, ప్రతి పౌరుడికి సంబంధించిన అంశం. తాగునీరు, ఆహార ఉత్పత్తి, పారిశుద్ధ్యం, పరిశ్రమలు.. ఇలా మన జీవనంలోని ప్రతి అంశం నీటితో ముడిపడి ఉంది. నీటి వనరులను కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, ప్రజలందరి సామాజిక బాధ్యత కూడా.

నీటిని ఆదా చేసే పది సులభమైన మార్గాలు

1. అవసరమైనంత నీటినే వాడండి: ఇంటికి వచ్చిన అతిథులకు మొదట సగం గ్లాసు నీరు అందించి, అవసరమైతే మరింత ఇవ్వండి. మిగిలిపోయిన నీటిని వృథా చేయకుండా మొక్కలకు ఉపయోగించండి.
2. బకెట్‌తో స్నానం చేయండి: షవర్ కింద ఎక్కువసేపు గడపకుండా, బకెట్ మరియు చెంబుతో స్నానం చేయడం అలవాటు చేసుకోండి.
3. ఆర్ఓ నీటిని తిరిగి వినియోగించండి: నీటి శుద్ధి యంత్రం నుంచి వెలువడే నీటిని సేకరించి, దాని నాణ్యతకు అనుగుణంగా నేల తుడవడం, వాహనాలు శుభ్రం చేయడం, ఫ్లష్ వంటి పనులకు ఉపయోగించండి.



4. కుళాయిని అవసరమైనప్పుడే తెరవండి: పళ్లు తోమేటప్పుడు, షేవింగ్ చేసేటప్పుడు కుళాయిని మూసి ఉంచండి. పాత్రలు కడిగేటప్పుడు కూడా నీటిని నిరంతరం వదలవద్దు.
5. వాహనాలను బకెట్‌తో శుభ్రం చేయండి: పైపుతో నీటిని ధారగా వదులుతూ వాహనాలు కడగడం మానేసి, కొద్దిపాటి నీటితో శుభ్రం చేయండి.
6. వంటగది నీటిని వృథా చేయవద్దు: కూరగాయలు, బియ్యం కడిగిన శుభ్రమైన నీటిని సేకరించి మొక్కలకు ఉపయోగించండి. ఉప్పు, సబ్బు లేదా ఇతర రసాయనాలు కలిసిన నీటిని ఉపయోగించవద్దు.
7. లీకేజీలను వెంటనే సరిచేయండి: కుళాయిలు, పైపులు, ఫ్లష్ ట్యాంకులు, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో నీటి లీకేజీలను నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే మరమ్మతు చేయించండి.
8. ఫ్లష్‌లో నీటి వినియోగాన్ని తగ్గించండి: తక్కువ నీటితో పనిచేసే డ్యూయల్ ఫ్లష్ వ్యవస్థలను ప్రోత్సహించండి. పారిశుధ్యానికి ఆటంకం కలగకుండా నీటిని పొదుపు చేయండి.
9. వాషింగ్ మెషీన్‌ను సక్రమంగా వాడండి: బట్టల పరిమాణానికి తగిన నీటి మట్టాన్ని ఎంచుకోండి. సాధ్యమైనంత వరకు పూర్తి లోడ్‌తో మెషీన్‌ను నడపండి.
10. వర్షపు నీటిని ఒడిసిపట్టండి: ఇళ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చూడండి. చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణకు సహకరించండి.

నీటి సంరక్షణే భవిష్యత్తుకు రక్షణ

నీటి కొరత ఏర్పడిన తర్వాత ట్యాంకర్ల కోసం ఎదురుచూడటం కంటే, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మేలు. ప్రభుత్వాలు నీటి సరఫరా వ్యవస్థల్లో లీకేజీలను అరికట్టాలి. స్థానిక సంస్థలు జలవనరులను పరిరక్షించాలి. ప్రజలు తమ ఇళ్లలో నీటిని పొదుపుగా వినియోగించాలి. నీటి సంరక్షణ ఒక్కరోజు చేపట్టే కార్యక్రమం కాదు.. అది మన జీవన విధానంగా మారాలి. "ఈరోజు ప్రతి నీటి చుక్కను కాపాడితేనే.. రేపటి తరాలకు జీవనాధారాన్ని అందించగలం! నీటిని పొదుపు చేద్దాం.. ప్రకృతిని కాపాడుదాం.. భవిష్యత్తును భద్రపరుచుకుందాం!

– కైలాస్ నాగేష్ 9849052956

మా ఎస్టీ హోదా మాకు కావాలి

- గద్వాలలో వాల్మీకుల గర్జన!



గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 24 । ప్రజా కలం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో నిర్వహించిన బైక్ ర్యాలీ, సంకల్ప సభ ఉత్సాహంగా సాగాయి. ధరూర్‌మెట్ట నుంచి నల్లకుంట కాలనీలోని వాల్మీకి భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, ఎస్టీ హోదా సాధనకు అనుకూలంగా నినాదాలు చేశారు. వాల్మీకి ఎస్టీ సాధన సంకల్ప సభకు దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాసు శ్యామల హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. వాల్మీకి బోయలు సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారికి ఎస్టీ హోదా కల్పించే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం వాల్మీకి సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ వాల్మీకి సంఘాల నాయకులు, మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలే లక్ష్యం..

పట్టభద్రుల ఓటు నమోదుపై బీజేపీ దృష్టి!

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 24, ప్రజాకలం:జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు వేసిన పట్టభద్రులు సైతం తాజా ఎన్నికల కోసం నిబంధనల ప్రకారం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరు నమోదుపై అవగాహన పెంచుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాధాన్యత కలిగినవని పేర్కొంటూ, ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులైన పట్టభద్రులందరికీ చేరువ చేయాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో గద్వాల నుంచి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బలిగేరా శివారెడ్డితో పాటు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మల్దకల్ సర్వసభ్య సమావేశం అట్టర్ ఫ్లాప్!

సమావేశంలోనే సెల్‌ఫోన్లతో బిజీగా అధికారులు

విధుల పట్ల నిర్లక్ష్యంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరపాలి!

గద్వాల ప్రతినిధి అక్టోబర్ 24 (ప్రజాకలం):

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఆశించిన స్థాయిలో సాగలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా స్పెషల్ ఆఫీసర్ జగ్గు నాయక్ హాజరయ్యారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమావేశంలోనే సెల్‌ఫోన్లతో బిజీగా ఉంటే ఎలా?

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన కీలక సమావేశంలో కొందరు అధికారులు సెల్‌ఫోన్లతో బిజీగా ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలు, గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే సమావేశంలోనే అధికారులు మొబైల్ ఫోన్లపై దృష్టి పెట్టడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సమావేశాలకు హాజరైతే సరిపోదు.. బాధ్యతగా వ్యవహరించాలి!

సర్వసభ్య సమావేశాలు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల సమస్యలకు పరిష్కారం చూపేందుకు నిర్వహిస్తారు. అలాంటి సమావేశాల్లో అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోతే ప్రజా సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమావేశానికి హాజరు కావడం మాత్రమే కాకుండా, ప్రజలకు సంబంధించిన అంశాలపై చిత్తశుద్ధితో చర్చించడం, తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడం కూడా అధికారుల బాధ్యత.



జిల్లా అధికారులు స్పందించాలి.. నిర్లక్ష్యంపై విచారణ జరపాలి!

ఈ వ్యవహారంపై జోగులాంబ గద్వాల జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. సమావేశంలో అధికారుల ప్రవర్తన, విధుల నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తప్పిదాల తీవ్రతను బట్టి సస్పెన్షన్ వంటి చర్యలను కూడా పరిశీలించాలని కోరుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే సర్వసభ్య సమావేశాలు మొక్కుబడి కార్యక్రమాలుగా మిగిలిపోకూడదని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమావేశాల్లో చర్చించిన సమస్యలపై తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరును కూడా సమీక్షించాలని కోరుతున్నారు.


అలికేప్ చౌరస్తాలో మళ్లీ అందకారం

ఈమధ్యనే ఏర్పాటుచేసిన లైట్లు మూన్నల్ల ముచ్చటేనా?

పట్టించుకోని జిహెచ్ఎంసి అధికారులు

అంబర్‌పేట్ అక్టోబర్ 24 (ప్రజాకాలం న్యూస్)

అంబర్‌పేట్ లోని అలీకేఫ్ చౌరస్తాలో అందకారం అనే ప్రజాకలం పేపర్ లో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందించి అధికారులు ఏర్పాటుచేసిన హైమాక్స్ లైట్లు మూన్నాల్ల ముచ్చటనే అయ్యాయి.లైట్లు వెలగక పోవడంతో మళ్లీ అంధకారం అలుముకున్నది. వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు అధికారులు గానీ,ప్రజా ప్రతినిధులు గాని ఈ సమస్యపై స్పందించక పోవడం పట్ల స్థానికులు పెదవి విరుస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి నాసిరకం లైట్లు ఏర్పాటు చేయడంతో అవి కొన్నిరోజులే పనిచేసి పాడైపోవడంతోతిరిగి అదే వరిస్థితి పునరావృతమైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పనిచేయాలని ప్రభుత్వం ఎన్ని కఠిన నిబంధనలు పెట్టిన అధికారుల తీరు మారకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అలీకేఫ్ చౌరస్తాలో నాన్యమైన ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దిమ్మదుర్తిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మంజూరు చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 24 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం దిమ్మదుర్తి గ్రామంలో కలెక్టర్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పలు ఇళ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా జె. రంజిత్ బాధ్యతల స్వీకరణ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 24: మహబూబ్‌నగర్ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా జె. రంజిత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.



ఇప్పటివరకు చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన జె. రంజిత్‌కు మహబూబ్‌నగర్ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా పదోన్నతి కల్పిస్తూ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు ఆయన శుక్రవారం జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో చేనేత కార్మికులు, జౌళి రంగానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడం, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవడం, చేనేత రంగ అభివృద్ధికి కృషి చేయడం తన ప్రాధాన్యతలుగా ఉంటాయని జె. రంజిత్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన శనివారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖకు సంబంధించిన పరిపాలనా అంశాలు, శాఖా కార్యక్రమాల అమలు తదితర విషయాలపై కలెక్టర్‌కు వివరించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో

పీఎం రాహత్ పథకం కీలక పాత్ర పోషిస్తుంది

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



నిర్మల్ అక్టోబర్ 24 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలిజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్మెంట్) పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుసంధానం, నిధుల విడుదల ప్రక్రియపై చర్చించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించడానికి పోలీస్ ఆమోదిత కేసులకు గరిష్టంగా 1 లక్షా 50 వేల రూపాయల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత బాధితుల ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఈ సమయంలో వేగంగా స్పందించాలని అన్నారు. ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసుకొని, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు, బాధితుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయడానికి టీఎంఎస్ 2.0 పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా బాధితుల చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలలో ఈ పథకంపై అవగాహన కల్పించాలని అన్నారు. అత్యవసర సేవల కోసం 112, సిసిటిఎన్ఎస్ వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా బాధితులకు వేగవంతమైన సేవలు అందుతాయని వివరించారు. ప్రతి జిల్లాలోనూ ఈ పథకం అమలును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశమందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి,వారి ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత శాఖలు వెంటనే అప్రమత్తమవ్వాలని అన్నారు. నగదు, బాదితుల సమాచారం అందుబాటులో లేని కారణంగా వైద్యసేవలు నిరాకరించకూడదన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఉండి ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాలను తగ్గించాలని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, రవాణా శాఖ అధికారి దుర్గా ప్రసాద్, వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను పరిహారమిచ్చి ఆదుకోవాలి

తానూర్,అక్టోబర్ 24(ప్రజా కలం): పంట నష్టాలు, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సంగెవు బొర్రన్న డిమాండ్ చేశారు. ఇటీవల పురుగుల మందు తాగి మృతి చెందిన దౌలత్‌బాద్‌కి చెందిన రాజుల వెంకన్న, తానూర్ గ్రామానికి చెందిన జాదవ్ బాలాజీ, దొంతులవార్ పోశెట్టి కుటుంబాలను గ్రామ సర్పంచ్ మాధవరావు పటేల్ తో కలిసి పరామర్శించారు, జీవో 194 ప్రకారం రూ.6 లక్షల పరిహారం, నెలకు రూ.5,000 పెన్షన్ ఇవ్వాలని కోరారు,రైతుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించి, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు,కూరగాయల సాగు, పాడి పరిశ్రమ ద్వారా రైతులకు నెలకు రూ.15,000 ఆదాయం వచ్చేలా ప్రోత్సహించాలని కోరారు, కార్యక్రమంలో నాయకులు, భీంరావ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల నిర్మాణాలకు ఆమోదిత ఇసుకను మాత్రమే వాడాలి: - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 24 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణాలన్నింటికీ ప్రభుత్వ ఆమోదిత ఇసుక మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, వివిధ శాఖల అభివృద్ధి పనులు, నిర్మాణాలలో ఇసుక వినియోగంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి పనికి చట్ట ప్రకారం మాత్రమే ఇసుకను పొందాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడే విధంగా ఇతర మార్గాల్లో ఇసుక సేకరించి వాడటాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని అన్నారు. నిర్మాణ పనులకు ఇసుకను పొందే మార్గాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. నాసిరకం ఇసుక వాడటం వల్ల నిర్మాణాల్లో నాణ్యత లోపాలు తలెత్తుతాయని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కూడా పారదర్శకంగా ఇసుక పొందాలని చెప్పారు. ఆయా నిర్మాణ పనుల్లో ఇసుక కొరత తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, మైనింగ్ అధికారి తిరుపతి రావు, ఆర్ అండ్ బి, నీటిపారుదల శాఖల ఈఈ లు సుభాష్, అనిల్, హౌసింగ్ పిడి శ్రీనివాస్, సిపిఓ గంగాధర్‌రెడ్డి, ఈడబ్ల్యుఐడిసి డిప్యూటీ ఈఈ గంగాధర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

వ్యక్తిగత సమాచారం భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

డిజిటల్ అరెస్ట్, నకిలీ ప్రొఫైల్స్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 24:

సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరియు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ సమన్వయంతో, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు సైబర్ నేరాల నివారణ, సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ గారు పాల్గొని సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార భద్రత, ఆన్‌లైన్ మోసాల నివారణకు సంబంధించిన పలు సూచనలు చేశారు.

వ్యక్తిగత సమాచారం భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డులు, సోషల్ మీడియా తదితర డిజిటల్ సేవల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత సమాచారం, ఆర్థిక వివరాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మొబైల్ యాప్‌లను ఉపయోగించే ముందు వాటి నిబంధనలు, అనుమతులను పరిశీలించాలని, ఆధార్, పాన్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను తెరవడం, నమ్మకంలేని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, ఉన్నతాధికారుల పేరుతో ఫోన్ చేసి బెదిరించడం, డిజిటల్ అరెస్ట్ పేరుతో భయాందోళనలకు గురిచేయడం, తక్షణమే డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా, సంబంధిత అధికారులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు. కార్యాలయాల్లోని అన్ని స్థాయిల సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సైబర్ నేరాల నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, జిల్లా పోలీసు శాఖ సమన్వయంతో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి: జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని, అత్యాశను, భయాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇలాంటి నేరాలను చాలా వరకు నివారించవచ్చని పేర్కొన్నారు. సైబర్ మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ఫిర్యాదు చేయడం వల్ల మోసగాళ్ల ఖాతాల్లోకి బదిలీ అయిన డబ్బును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, బ్యాంకింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అపరిచితులు పంపే ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు. కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారుల ఫొటోలతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్స్ సృష్టించి డబ్బులు అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డబ్బులు పంపే ముందు సంబంధిత వ్యక్తులను నేరుగా సంప్రదించి నిర్ధారించుకోవాలని తెలిపారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అవగాహన వీడియోల ద్వారా సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి, సైబర్ నేరగాళ్లు ప్రజలను ఎలా మోసం చేస్తున్నారు అనే అంశాలను వివరించారు. ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్‌లు, సోషల్ మీడియా మోసాలు, నకిలీ ప్రొఫైల్స్ తదితర సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఎవరికీ ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయవద్దని వివరించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని, మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. పిల్లల ఆన్‌లైన్ భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి పిల్లలు ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా యాప్‌లను ఉపయోగిస్తున్నప్పుడు తల్లిదండ్రులు తగిన పర్యవేక్షణ కలిగి ఉండాలని ఎస్పీ సూచించారు. సైబర్ వేధింపులు, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలు, అనుచిత కంటెంట్ వంటి అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. చిన్నారులకు సంబంధించిన లైంగిక దోపిడీ చిత్రాలు, వీడియోలను వీక్షించడం, భద్రపరచడం లేదా ఇతరులకు పంపడం తీవ్రమైన చట్టపరమైన పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. పిల్లల ఆన్‌లైన్ భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

స్థానికంగా సైబర్ నేరాలకు పాల్పడిన ముఠా అరెస్టు

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఎస్పీ, జిల్లాలోనూ సైబర్ నేరాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఇటీవల తువ్వగడ్డ తండా ప్రాంతంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్ణయం తీసుకునే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సైబర్ నేరాల నివారణ అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ గారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరి కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ మండలంలో పలు ఓటర్ నమోదు కేంద్రాలను

సందర్శించిన గొడుగునూరు లక్ష్మిరెడ్డి



తల్లాడ. అక్టోబర్.24 ప్రజా కలం న్యూస్

ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు పట్టబద్ధులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, తల్లాడ మండలం ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్ పిలుపునిచ్చారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ గారి ఆదేశాలతో శనివారం తల్లాడ మండలంలోని ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా లికుర్తవల్లి కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. పట్టభద్రుల ఓట్లను చేర్పించారు. ఈ సందర్భంగా వీలైనంత త్వరగా పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు గడువు సమీపిస్తున్నందున పట్టభద్రుల ఓట్లు ఇంకా త్వరగా నమోదు చేసే విధంగా కృషి చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుర్నవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బసవపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు కలకొడిమ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశవపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు. ముద్దునూరు ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కేంద్రంగా పరిధిలో ఉన్న గ్రామాల ముఖ్య నాయకులతో నమోదు కేంద్రాన్ని సర్పంచ్ రామ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సందర్శించారు నూతనంగా చేర్పించే పట్టబదులు వీలైనంత త్వరగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామం సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం గ్రామంలో సర్పంచ్ మోదుగు తిరుమల్ రావు ఉప సర్పంచ్ జగన్ ఆధ్వర్యంలో ఓట్ల నమోదు కేంద్రాన్ని సందర్శించారు ఈ సందర్భంగా నూతన పట్టభద్రులను చేర్పించారు ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు

భూభారతి పెండింగ్‌ల దరఖాస్తులు,

పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 24:

భూభారతి పెండింగ్‌ల దరఖాస్తులు, మీ సేవ ద్వారా అందిన దరఖాస్తులు, నాలా కన్వర్షన్, కోర్టు కేసులు, మ్యుటేషన్లకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి మండల తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూభారతి పెండింగ్ దరఖాస్తులు, గ్రామాల్లో రీసర్వే పనుల పురోగతి, భూదాన్ భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న కేసులు, 60 రోజులకు మించి పరిష్కారం కాని దరఖాస్తులు, వాటి ప్రస్తుత స్థితి, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలు, వాటి పరిష్కార పురోగతిని సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. అలాగే మండలాల వారీగా ఇప్పటివరకు గుర్తించిన భూదాన్ భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. మీ సేవలో పెండింగ్‌లో ఉన్న కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తదితర దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నిర్ణీత సమయంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులతో పాటు నాలా కన్వర్షన్, కోర్టు కేసులు, మ్యుటేషన్‌కు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను కూడా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భూత్పూర్, అడ్డాకల్, సీసీ కుంట, మహమ్మదాబాద్ మండలాల తహసీల్దార్లు సమర్థవంతంగా పనిచేసి పెండింగ్ దరఖాస్తులను గణనీయంగా తగ్గించడంపై కలెక్టర్ అభినందించారు. కోయిలకొండ, హన్వాడ, రాజాపూర్, మూసాపేట్ మండలాల తహసీల్దార్లు కూడా మంచి పురోగతి సాధించి పెండింగ్ దరఖాస్తులను చాలావరకు పరిష్కరించారని ప్రశంసించారు. మిగిలిన దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించాలని సూచించారు. మహబూబ్‌నగర్ అర్బన్, జడ్చర్ల, గండీడ్, నవాబుపేట, కౌకుంట్ల మండలాల్లో భూభారతి కింద ఎక్కువ సంఖ్యలో ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు కలెక్టర్ గుర్తించారు. సంబంధిత తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

రీసర్వే పనులను వేగవంతం చేయాలి



అనంతరం గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాల సహకారంతో రీసర్వే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోటకద్ర గ్రామంలో రీసర్వే పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్‌ను ఆదేశించారు. జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో రీసర్వే పనులు పూర్తయ్యాయని, అమ్మాపూర్ గ్రామంలో పనులు ప్రారంభించినట్లు జడ్చర్ల తహసీల్దార్ వివరించారు. హన్వాడ మండలం చీకురపల్లి, ఖాజీపూర్ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయినట్లు ఆ మండల తహసీల్దార్ తెలిపారు. అడ్డాకల్, మూసాపేట్, సీసీ కుంట, గండీడ్, మహమ్మదాబాద్ తదితర మండలాల్లో రీసర్వే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ లక్ష్యాలను నిర్దేశించుకుని పనులు చేపట్టాలని, అక్టోబర్ 30 నాటికి ప్రతి గ్రామంలో కనీసం 300 ఎకరాల మేర రీసర్వే పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

సాండ్ బజార్ స్థల ప్రతిపాదనపై సమీక్ష

అనంతరం మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో సాండ్ బజార్ ఏర్పాటుకు గత సమావేశంలో ప్రతిపాదించిన స్థలం వివరాలను కలెక్టర్ సంబంధిత తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ అంశానికి సంబంధించిన ఫైల్‌ను ఏడీ మైన్స్, ఆర్డీఓలతో సంప్రదించి వెంటనే సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఆర్డీఓ నవీన్, భూమి రికార్డులు, సర్వే విభాగం ఏడీ అశోక్, మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే మొదటి దశ పనులను వేగవంతం చేసి

త్వరితగతిన పూర్తి చేయాలి

- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్



నిర్మల్ అక్టోబర్ 24 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భూముల రీసర్వే మొదటి దశ ప్రక్రియను వేగవంతం చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

రీసర్వే ప్రక్రియ పురోగతిపై శనివారం సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు.

భూ రీసర్వే మొదటి దశలో అన్ని జిల్లాల్లో ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాలలో సర్వే పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సర్వే పనులకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకొని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, యంత్ర పరికరాలను సమకూర్చుకొని నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సర్వే పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, పనుల పురోగతికి అనుగుణంగా బృందాలను కేటాయించాలని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించి పనులు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల వారీగా సర్వే లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రతిరోజూ చేపట్టిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను సమీక్షించాలని చెప్పారు. సర్వే పనుల్లో వెనుకబడిన గ్రామాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి సారించి పనుల వేగం పెంచాలని తెలిపారు. భూ రీసర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూ సరిహద్దులకు సంబంధించిన సమస్యలు, భూ రికార్డుల్లో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణకు ఆటంకాలు ఏర్పడకుండా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అవసరమైన చోట సంబంధిత భూయజమానులకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వాటి పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ రీసర్వే పనులకు అవసరమైన యంత్ర పరికరాలు, సాంకేతిక పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలను జిల్లా స్థాయిలో ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. సర్వే బృందాలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరికరాల కొరత కారణంగా పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

భూ రీసర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. భూ రీసర్వే ప్రక్రియ ద్వారా భూములకు సంబంధించిన వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు, భూ రికార్డుల్లో పారదర్శకత పెంపొందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అన్ని జిల్లాల్లో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి దశలో చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియ వివరాలను కమిషనర్ కు తెలియజేశారు. ఇటీవల అదనపు సర్వే యంత్రాలు సమకూర్చుకున్నట్లు వివరించారు. రీ సర్వే ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అన్నారు. జిల్లాలో సంబంధిత అధికారుల సమక్షంలో రీ సర్వే ప్రక్రియ సజావుగా జరుగుతుందని చెప్పారు. అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సర్వేను కొనసాగిస్తున్నారని తెలిపారు.

ఈ వీసీలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్ విఠల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు, ఇతర సామగ్రి పంపిణీ

- విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది

- 7వ వార్డు కౌన్సిలర్ అనంత అలివేలమ్మ గోపాల్ రెడ్డి



నాగర్ కర్నూల్ అక్టోబర్ 24 (ప్రజా కలం):ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడంతోపాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలుఅభినందనీయమని నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ అనంత అలివేలమ్మ గోపాల్ రెడ్డి అన్నారు.నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం అందించిన స్కూల్ యూనిఫాంలు, షూస్, సాక్స్ తదితర సామగ్రిని విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ యూనిఫాంలు, షూస్, సాక్స్ వంటి అవసరమైన సామగ్రిని అందించడం మంచి పరిణామమని పేర్కొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులని, భవిష్యత్తులో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించే బాధ్యత విద్యార్థులపై ఉందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సైన్స్, టెక్నాలజీ, సమాజ సేవ, వ్యాపార రంగాల్లో రాణించేలా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పుస్తక జ్ఞానంతోపాటు నూతన నైపుణ్యాలను నేర్చుకోవాలని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపిస్తూ, వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ బాబు, ఉపాధ్యాయులు, ఏఏఏపీసీ చైర్‌పర్సన్ యాదమ్మ, చంద్రయ్య, బాలస్వామి, రవీందర్ రెడ్డి, రామకృష్ణ, బాలమశి, హుస్సేన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజులు పని పొందాలి

- వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంతో పేదలకు ఆర్థిక భరోసా

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 24 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు పొందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. పంటల దిగుబడి తగ్గడం, వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితుల్లో ఈ పథకం గ్రామీణ పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు. కడెం మండలం కొండుకూరు గ్రామంలోని ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జోన్-1 స్థాయి వికసిత్ భారత్ జీ రామ్ జీ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకం కింద చేపట్టే పనులకు కూలీ డబ్బులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో నీటి సంరక్షణ, జలవనరుల అభివృద్ధి వంటి పనులను చేపట్టడం ద్వారా ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజల వద్దకే వెళ్లి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు సందీప్, తుకారాం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తల్లాడలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తల్లాడ అక్టోబర్ 24 ప్రజా కలం న్యూస్ తల్లాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 బి2005 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం స్థానిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడలో చదువుకొని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ కలుసుకొని తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఎవరెవరు ఏ రంగాల్లో స్థిరపడ్డారు అనే దాని గురించి ఆత్మీయంగా పలకరించుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ 21 ఏళ్ల తర్వాత కలుసుకొని తమ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో 35 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం: మంత్రి వాకిటి శ్రీహరి



ఆత్మకూరు:(ప్రజాకలం జిల్లా రిపోర్టర్) పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు . ఆత్మకూరు మండలంలో 35 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

తాడిచెర్ల నుంచి శబరిమలకు భక్తి యాత్ర

మోహన్‌రావు గురుస్వామికి తహసీల్దార్ రవికుమార్ శుభాకాంక్షలు

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు.. ఇరుముడితో పాదయాత్ర ప్రారంభం

మల్హర్, అక్టోబర్ 24 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచెర్లకు చెందిన మల్కా మోహన్‌రావు గురుస్వామి 31వసారి అయ్యప్ప మాలధారణ చేసి, కేరళలోని శబరిమల క్షేత్రానికి మహా పాదయాత్రగా శనివారం బయలుదేరారు. ఈ సందర్భంగా తాడిచెర్లలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడి కట్టుకొని యాత్ర ప్రారంభించారు. మోహన్‌రావు పాదయాత్ర విజయవంతం కావాలని మండల తహసీల్దార్ కె. రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.మాజీ అయ్యప్ప మాలధారులు, గురుస్వాములు సంపత్‌రావు, మల్కా భాస్కరరావు, తిర్రి అశోక్, మెతుకు సమ్మయ్య, కిషన్‌రావు, ఓదెల రాజబాబు, కుక్కడపు వెంకటేశ్వర్లు, పడితల లింగారావు,మేనం ఆగయ్య, కోట నవీన్, ముడితనపల్లి ప్రభాకర్ తదితరులు మోహన్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. యాత్ర నిర్విఘ్నంగా సాగి, స్వామివారి దర్శనంతో విజయవంతం కావాలని కోరుకున్నారు.



జీవనజ్యోతి ఎంపికలో పారదర్శకత ఏదీ?

గత లావాదేవీలు, ఆడిట్ వివరాలపై స్పష్టత కోరుతున్న సభ్యులు

పాత అభ్యర్థినే మళ్లీ ఎంపిక చేస్తున్నారంటూ ఆరోపణలు

ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్



మల్హర్, అక్టోబర్ 24 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచర్ల జీవనజ్యోతి గ్రామైక్య సంఘం (వీవోఏ) అధ్యక్షురాలి ఎంపికపై మరోసారి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో లావాదేవీలు, ఆడిట్ వివరాలపై స్పష్టత లేకుండానే ఎంపికకు ప్రయత్నిస్తున్నారని గ్రూపు సభ్యులు ఆరోపించడంతో ఏప్రిల్‌లో ఈ ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలిసింది. ఆరు నెలల విరామం తర్వాత గతంలో ఎంపికై, ఆపై రద్దయిన అభ్యర్థినే మళ్లీ నియమించేందుకు ప్రయత్నిస్తున్నారని కొందరు సభ్యురాళ్లు ఆరోపిస్తున్నారు.తమకు సమాచారం ఇవ్వకుండానే ఎంపిక ప్రక్రియ చేపట్టడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం తమ్మిశెట్టి సంధ్యారాణి మండల సమైక్యానికి దరఖాస్తు సమర్పించి, జీవనజ్యోతి వీవోఏ అధ్యక్షురాలిగా తనకూ అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. అయితే, తన దరఖాస్తును తాడిచర్ల గ్రామైక్య సంఘం అధ్యక్షురాలికి అందజేయాలని ఏపీఎం సూచించినట్లు ఆమె పేర్కొన్నారు.గతంలో జరిగిన లావాదేవీలు, ఆడిట్ వివరాలపై పూర్తిస్థాయి స్పష్టత తీసుకురావాలని సభ్యులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపి, ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అర్హులైన వారందరికీ అవకాశం కల్పించాలని, ఈ విషయంపై జిల్లా సెర్ప్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పలువురు సభ్యులు తెలిపారు.

ఇస్రో రాకెట్ ప్రయోగంలో శ్రీ చైతన్య పూర్వ విద్యార్థి వినయ్ కుమార్ కీలక పాత్ర

ఖమ్మం శ్రీ చైతన్య విద్యాసంస్థలకు గర్వకారణం-విద్యార్థికి యాజమాన్యం అభినందనలు

పాలేరు అక్టోబర్ 24(ప్రజా కలం న్యూస్)

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీహరికోటలో విజయవంతంగా నిర్వహించిన భారత తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ ప్రయోగంలో శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్, ఖమ్మం కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి వినయ్ కుమార్ ఇంజినీర్‌గా బాధ్యతలు నిర్వర్తించడం కళాశాలకు గర్వకారణమని చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ అత్యున్నత అంతరిక్ష పరిశోధనా కార్యక్రమంలో తమ కళాశాల పూర్వ విద్యార్థి భాగస్వామి కావడం అధ్యాపకులు, విద్యార్థులు, యాజమాన్యానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తే ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వినయ్ కుమార్ నిరూపించారని అన్నారు. కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య మాట్లాడుతూ, నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక ప్రయోగశాలల్లో ప్రాక్టికల్ శిక్షణ, పరిశోధనా దృక్పథం, క్రమశిక్షణ, నైతిక విలువలు, అధ్యాపకుల మార్గదర్శకత్వం విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు దోహదపడుతున్నాయని తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ, తరగతి గది బోధనతో పాటు ప్రయోగశాలల్లో పొందిన అనుభవం, ప్రాజెక్టులు, సాంకేతిక కార్యక్రమాల్లో పాల్గొనడం, పరిశ్రమలతో అనుసంధానం, అధ్యాపకుల ప్రోత్సాహం వినయ్ కుమార్ విజయానికి పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. సమస్యలను విశ్లేషించే నైపుణ్యం, సమయపాలన, క్రమశిక్షణ, జట్టు భావన వంటి లక్షణాలు ఆయనకు వృత్తిపరంగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కేవలం డిగ్రీలు అందించడమే కాకుండా దేశ నిర్మాణంలో భాగస్వాములయ్యే నైపుణ్యం కలిగిన ఇంజినీర్లను తీర్చిదిద్దడమే తమ విద్యాసంస్థల లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లను అధిగమించేలా శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.



వినయ్ కుమార్ సాధించిన ఈ ఘనత కళాశాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని యాజమాన్యం పేర్కొంది. ఆయన మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, శ్రీ చైతన్య విద్యాసంస్థలకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డీన్ డాక్టర్ వి. సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ చార్యలు, శ్రీ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు వినయ్ కుమార్‌ను అభినందించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ఉద్యోగుల సమ్మెకు ఐద్వా సంపూర్ణ మద్దతు - ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత డిమాండ్

నాగర్ కర్నూల్, అక్టోబర్ 24 (ప్రజా కలం):జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారందరినీ పర్మినెంట్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు ఐద్వా మహిళా సంఘం తరఫున ఆమె సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా కందికొండ గీత మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వైద్య రంగంలో సేవలందిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి కేడర్ ఉద్యోగికి 100 శాతం గ్రాస్ జీతం అందించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేయడంతోపాటు మూడేళ్లకోసారి బదిలీ చేసే విధానాన్ని రద్దు చేయాలని, ఇప్పటికే బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి పాత స్థానాల్లో నియమించాలని డిమాండ్ చేశారు. జీఓ 1195ను పునఃపరిశీలించి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఇంక్రిమెంట్లు అందించాల్సి ఉన్నప్పటికీ, అవి అమలు కావడం లేదని ఆమె ఆరోపించారు. సుమారు 20 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు సైతం వారి పనికి తగిన పారితోషికం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలని కోరారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పోరాటానికి ఐద్వా మహిళా సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు, ఎన్‌హెచ్‌ఎం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, శ్రీనివాసులు, దేవుడు, వనజ, అరుణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.గమనిక: మీరు ఇచ్చిన సమాచారంలో మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఒకచోట 108 రోజులుగా, మరోచోట 180 రోజులుగా పేర్కొన్నారు.



డాక్టరేట్ పొందిన వంకేశ్వరం నిరంజన్‌కు ఘనంగా సన్మానం



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం, అక్టోబర్ 24 శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో డాక్టరేట్ పొందిన వంకేశ్వరం నిరంజన్ గారికి (కెవిపిఎస్) (కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) ఆధ్వర్యంలో డాక్టర్ వంకేశ్వరం. నిరంజన్ గారిని శాలువాతో సత్కరించి, డాక్టరేట్ సాధించినందుకు . అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వంకేశ్వరం నిరంజన్ గారు మాట్లాడుతూ.. డాక్టరేట్ పొందడం ఎంతో సంతోషాన్ని, బాధ్యతను కలిగించిందని దళితుల సమస్యలు మరింత పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా ఉపయోగపడాలని అన్నారు. ముఖ్యంగా దళితులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, బడుగు బలహీనవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో కులవివక్ష, సామాజిక అసమానతలు, విద్యా అవకాశాల కొరత, ఉపాధి సమస్యలు, పేదరికం వంటి సమస్యలు అనేకమంది జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎక్కడైనా పేదలు, దళితులు, బడుగు బలహీనవర్గాల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వస్తే, ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల మధ్య ఉండి పోరాటం చేయడం తన బాధ్యతగా పెరిగిందని అన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, న్యాయం జరిగే వరకు బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

బొంద్రేట్‌లో నీటి వాడకం, వ్యవసాయంపై గ్రామసభ



తానూర్,అక్టోబర్ 24(ప్రజా కలం): మండలంలోని బొంద్రేట్ గ్రామంలో నీటి వినియోగం, విద్యుత్ వాడకం మరియు వ్యవసాయ ఆధారిత పంటలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ రవీంద్ర పాటిల్ షిందే,కార్యదర్శి,తిరుపతి రెడ్డి, టీఏ అంబాదాస్, పోశెట్టి, జేఎల్ఎం సాయినాథ్, ఉపసర్పంచ్ బత్తి శివ, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొని, వ్యవసాయం, విద్యుత్ పొదుపుపై కీలక సూచనలు చేశారు.

ఖమ్మం రూరల్ మండలంలోని దివ్యాంగ మహిళలకు శుభవార్త

- ఉచిత వ్యాపార నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



పాలేరు అక్టోబర్ 24(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం రూరల్ మండలంలోని దివ్యాంగ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి, ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించేందుకు ఎస్‌బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 10 రోజుల వ్యాపార నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. శిక్షణ ద్వారా దివ్యాంగ మహిళలకు వ్యాపార నిర్వహణపై అవగాహన కల్పించి, తమ ఆసక్తి మరియు సామర్థ్యాలకు అనుగుణంగా సొంతంగా చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందేలా ప్రోత్సహించనున్నారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలో నివసిస్తున్న దివ్యాంగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణలో పాల్గొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ డైరెక్టర్ చంద్రశేఖర్, కోరారు.పరిమిత సంఖ్యలో మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నందున ఆసక్తి గల దివ్యాంగ మహిళలు వెంటనే సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9397080088, 9642589084 ఈ శిక్షణ కార్యక్రమం దివ్యాంగ మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం సాధించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

భైంసాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠా అరెస్ట్



తానూర్, అక్టోబర్ 24(ప్రజా కలం): భైంసా, లోకేశ్వరం మండలాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను భైంసా రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు,నిందితుల నుంచి 170 తులాల వెండి, 13 గ్రాముల బంగారం, రూ. 22 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు,ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో, ఏఎస్పీ సాయి కిరణ్ పర్యవేక్షణలో చేపట్టిన ఆపరేషన్ ఫలితంగా ఈ ముఠా చిక్కింది,వీరి అరెస్ట్‌తో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అక్టోబర్ 26న శ్రీ మహర్షి వాల్మీకి జయంతి నిర్వహణ - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, అక్టోబర్ 24(ప్రజా కలం న్యూస్)అక్టోబర్ 26న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించి, వారి చిత్రపటానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జయంతి కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నూతన ఎస్సై సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కొమ్ము ప్రసాద్

పాలేరు అక్టోబర్ 24(ప్రజా కలం న్యూస్)కూసుమంచి మండల కేంద్రంలోని శనివారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కూసుమంచి ఎస్సై సతీష్‌ను బహుజన నాయకుడు కొమ్ము ప్రసాద్, పడిశాల వెంకన్న మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కొమ్ము ప్రసాద్ కోరారు. యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎస్సై సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 31 న జరిగే “యువ భారత్” ర్యాలీ కి ఆహ్వానం

కూకట్ పల్లి, అక్టోబర్ 24, ప్రజా కలం ప్రతినిధి:

స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన “యువ భారత్” కార్యక్రమానికి రావాల్సిందిగా కూకట్ పల్లి ట్రాఫిక్ ఏసీపీ గురు ప్రసాద్



ను స్వచ్ఛ భారత్ అభియాన్ సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ అభియాన్ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 31 వ తేదీన సర్దార్ పటేల్ నగర్ లోని సర్దార్ పటేల్ విగ్రహం నుండి వివేకానంద నగర్ వరకు చేపట్టనున్న ‘యువ భారత్’ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన పోలీసుల అనుమతిని కోరుతూ కూకట్ పల్లి ట్రాఫిక్ ఏసీపీ గురు ప్రసాద్ కు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమ ఉద్దేశాలను, యువత భాగస్వామ్యాన్ని ఏసీపీకి వివరించగా, సానుకూలంగా స్పందించిన ఏసిపి తమ పూర్తి సహకారం అందిజేస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సంస్థ సభ్యులు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ అభియాన్ బృందం సభ్యులు డాక్టర్ వంశీ, అడ్వకేట్ కేశవ్, వినోద్ గౌడ్, తోట రమేష్, నర్వ పవన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

కూకట్ పల్లి, అక్టోబర్ 24, ప్రజా కలం ప్రతినిధి:

ఉమ్మడి రంగారెడ్డి-- మహబూబ్‌నగర్--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి మాజీ



అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సత్యం శ్రీరంగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాప్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బి. సంజీవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యావంతుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సమస్యలపై బికేఎస్ ఉద్యమం

సోమవారం మండల కేంద్రాల్లో నిరసన.

కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పి. నర్సింహా రెడ్డి.

సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24(ప్రజా కలం):

రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని భారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు పి. నర్సింహారెడ్డి ,ప్రధాన కార్యదర్శి పర్యాద రామకృష్ణారెడ్డి శనివారం పేర్కొన్నారు. ముఖ్యంగా లో వోల్టేజి సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. దీనివల్ల రైతులు లక్షలాది రూపాయలను నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా లేదన్నారు. వరంగల్ డిక్లరేషన్ ఆమలులో నిర్లక్ష్యం వల్ల రైతులను మోసం చేసినట్టుగా తెలుస్తుంది అన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ విషయంలో రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. చెరుకు టన్నుకుగాను ఐదువేల రూపాయలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్ ట్రాలీని వ్యవసాయ పనిముట్టుగా గుర్తించాలని, రిజిస్ట్రేషన్ ను ఎత్తివేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఇంకా పెండింగ్లో ఉన్నాయని వారు చెప్పారు. సోమవారం నాడు ఈ సమస్యలపై మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు, అంతేకాకుండా తహసీల్దార్లకు ఎక్కడికి అక్కడే వినతిపత్రం సమర్పిస్తామని భారతీయ కిసాన్ సాంగ్ నేతలు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రైతుల పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు సూచించారు.



గజ్వేల్‌లో ఘనంగా స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఉచిత మెగా వైద్య శిబిరం

- 500 మందికి పైగా వైద్య పరీక్షలు

- ఆరోగ్యంపై అవగాహన కల్పించిన వైద్య బృందాలు

గజ్వేల్, అక్టోబర్ 24 (ప్రజా కలం ప్రతినిధి):

బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మాసం సందర్భంగా స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ శిబిరం ద్వారా 500 మందికి పైగా లబ్ధిదారులకు వైద్య పరీక్షలు, నిపుణుల వైద్య సంప్రదింపులు,ఆరోగ్య అవగాహన సేవలు అందించారు. వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం,ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్,



మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి,వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కార్ పద్మాభాయ్ నర్సింగరావు, కౌన్సిలర్లు,లయన్స్ క్లబ్ సభ్యులు రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వ్యాధుల లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో స్థానిక ప్రజాప్రతి నిధులు,వైద్య సంస్థలు, సామాజిక సేవా సంస్థల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ శిబిరంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ జోనల్ మేనేజర్ యుగంధర్,బ్రాంచ్ మేనేజర్ శివప్రసాద్, సీనియర్ సేల్స్ మేనేజర్ రాధాకృష్ణ, హెచ్‌ఆర్‌ఎం బృందానికి చెందిన షారోన్, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు, వివిధ ఆసుపత్రుల వైద్య బృందాలు, లయన్స్ క్లబ్ సభ్యులు,వైద్య సిబ్బంది, గజ్వేల్ ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవింగ్‌పై గజ్వేల్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

-14 మందికి జైలు శిక్ష..మరో 10 మందికి రూ.లక్ష జరిమానా

- డ్రంకెన్ డ్రైవింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

:ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.సత్యనారాయణ

గజ్వేల్, అక్టోబర్ 24 (ప్రజా కలం ప్రతినిధి):

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.డ్రంకెన్ డ్రైవింగ్ కేసులకు సంబంధించి శనివారం గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో 24 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 14 మందికి వివిధ కాలపరిమితులతో జైలు శిక్షలు విధించగా,మరో 10 మందికి కలిపి రూ.లక్ష జరిమానా విధించారు.

14 మందికి వివిధ కాలపరిమితులతో జైలు శిక్షలు

జైలు శిక్ష పడిన వారిలో ఐదుగురికి ఒక రోజు,మరో ఐదుగురికి మూడు రోజుల చొప్పున,ఒకరికి నాలుగు రోజులు, ముగ్గురికి ఐదు రోజుల చొప్పున శిక్ష విధించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.సత్యనారాయణ హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,మద్యం సేవించిన తర్వాత స్వయంగా వాహనాలు నడపకుండా క్యాబ్‌లు లేదా ఇతర సురక్షిత రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు.డ్రంకెన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తామని,నిబంధనలు ఉల్లంఘించే



వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని విజ్ఞప్తి చేశారు.“మద్యం సేవించి వాహనం నడపవద్దు.మీ కుటుంబాన్ని, ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దు” అని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో ఓపెన్ హౌస్

విద్యార్థులకు పోలీసుల విధులు,చట్టాలపై అవగాహన

గజ్వేల్ నియోజకవర్గం:24 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

మార్కుక్: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మార్కుక్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్,జడ్పీహెచ్ఎస్ మార్కుక్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే విధులు,ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు,చార్జిషీట్ దాఖలు తదితర



ప్రక్రియలను పోలీసులు వివరించారు.పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ రికార్డులు,పోలీసు విధివిధానాలు, వివిధ చట్టాలు, బాలల రక్షణ చట్టాలు,పౌరుల చట్టపరమైన హక్కులు,బాధ్యతలపై అవగాహన కల్పించారు.పోలీసు వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు,చట్టాలపై అవగాహన పెంచుకుని,నిబంధనలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కుక్ ఎస్ఐ ఎస్.కె.యూనస్,హెడ్ కానిస్టేబుల్ ఖాజా, కానిస్టేబుళ్లు రాజారెడ్డి,నరసింహులు, శ్రీకాంత్ రెడ్డి, కిషోర్,కల్యాణి,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లో గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్

హైదరాబాద్ : హైదరాబాద్‌లో తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి మరో కీలక చర్యకు సిద్ధం అవుతోంది. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నగరంలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే నిర్మాణ పనులు, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించేలా ‘గ్రీన్ వాటర్’ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎస్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ) యోచిస్తోంది. ఇందులో భాగంగా కోకాపేటలో ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసే అవకాశాలను జలమండలి పరిశీలిస్తోంది. ఈ ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే తాగడానికి ఉపయోగించే నీటిని ఇతర పనులకు వినియోగించాల్సిన అవసరం తగ్గనుంది.గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి గురువారం కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను



పరిశీలించి.. పరీక్షలు నిర్వహించే విధానం, పాటిస్తున్న ప్రమాణాలు, ఫలితాలను నమోదు చేసే ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు సరఫరా చేయాలంటే దాని నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని.. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించాలని అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జలమండలి అధికారులతో పాటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీఎస్‌పీసీబీ) అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నీటి నాణ్యతకు సంబంధించిన పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. ఈ వివరాలను హైదరాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయం నుంచే నేరుగా పర్యవేక్షించేలా వ్యవస్థను రూపొందించాలని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఐటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి పరీక్షల వివరాలు పారదర్శకంగా ఉండటంతో పాటు అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులో ఉండేలా రికార్డులను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల నీటి నాణ్యతపై పర్యవేక్షణ మెరుగుపడటంతో పాటు సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్లకు నీటిని నింపే విధానంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రతి ట్యాంకర్ సామర్థ్యాన్ని బట్టి నీటి నింపే పరిమితులను నిర్ణయించాలని అశోక్‌రెడ్డి ఆదేశించారు. ఒక్కో ట్యాంకర్‌కు ఎంత నీటిని సరఫరా చేశారు.. దాని సామర్థ్యం ఎంత.. వంటి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ట్యాంకర్లలో నిర్దేశిత పరిమితికి మించి నీరు నింపకుండా నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. అదనంగా మిగిలే నీటిని వృథా చేయకుండా సంబంధిత చెరువుకు మళ్లించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.శుద్ధి చేసిన నీటిని తాగునీటికి ప్రత్యామ్నాయంగా కాకుండా.. తాగడానికి అవసరం లేని పనులకు వినియోగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జలమండలి అధికారులు చెబుతున్నారు. ఈ నీటిని నిర్మాణ రంగం, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత, దుమ్ము నియంత్రణ, పార్కులు, తోటల నిర్వహణ వంటి అవసరాలకు ఉపయోగించేలా నగరప్రజలను ప్రోత్సహించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనుల్లో తాగునీరు వినియోగించే సందర్భాలు తగ్గితే నగరంలోని తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అయితే.. ఈ శుద్ధి చేసిన నీటిని ఏయే అవసరాలకు ఎంత పరిమాణంలో సరఫరా చేయాలన్నది నాణ్యత ప్రమాణాలు, భద్రతా నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించాల్సి ఉంటుంది. ఫిల్లింగ్ స్టేషన్లలో నీటి నాణ్యత, సరఫరా పరిమాణం, భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని జలమండలి స్పష్టం చేసింది. కోకాపేటలో గ్రీన్ వాటర్ కేంద్రం ఏర్పాటుపై సాంకేతిక పరిశీలన కొనసాగుతుండగా.. దాని ఏర్పాటు, అమలు తేదీ, సరఫరా సామర్థ్యంపై అధికారికంగా మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది.

మూడేండ్లయినా ముచ్చట లేదు..

ఊసే లేని హనుమకొండ కొత్త బస్ స్టేషన్ నిర్మాణం

హనుమకొండ : వరంగల్ రెండో రాజధాని అని మంత్రులు పదేపదే చెబుతున్న ప్రకటనలకు, అభివృ ద్ధిలో ప్రభుత్వ తీరుకు పొంతన కుదరడం లేదు. రవాణాలో కీలకమైన హనుమకొండ బస్ స్టేషన్ కొత్త భవనం నిర్మాణంలో కాంగ్రెస్ సర్కారు నిర్ణక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్రతి రోజూ 3 లక్షల మంది రాకపోకలు సాగించే ఈ బస్టాండ్ కొత్త భవన నిర్మాణాన్ని పట్టించుకోవడంలేదు. అధికారంలోకి వచ్చి మూడేండ్లు పూర్తవుతున్నా ఒక్క ఇటుకైనా పెట్టలేదు. దీని నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.83 కోట్లు మంజూరు చేసింది. 2023 అక్టో బర్లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. మూడేండ్లు పూర్తవుతున్నా దాని ముచ్చటే మరిచింది. పట్టించుకోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు: ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపో వడంతో హనుమకొండ బస్టేషన్ కొత్త భవన నిర్మాణ పనులు మొదలు కావడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన పనులను పూర్తి చేసే విషయంలోనూ కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నది. అభివృద్ధి పనుల చేసేందుకు మంజూరైన నిధులను విడుదల చేయడం లేదు.

ఎల్‌నినో ప్రభావాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

జయశంకర్ భూపాలపల్లి : ఎల్‌నినో ప్రభావాల వల్ల భవిష్యత్తులో తలెత్తే వాతావరణ మార్పులు, వర్షపాత లోటు, ఉష్ణోగ్రతల పెరుగుదల తదితర పరిస్థితులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన జిల్లా పౌర సంబంధాల అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి డీపీఆర్వో శీలం శ్రీనివాస్‌తో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరై ఎల్‌నినో ప్రభావాలు, వాటిని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో డీపీఆర్వోల పాత్రతో పాటు, కళాకారుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన ప్రాధాన్యతను వివరించారు. కళాజాతాలు, పాటలు, నాటికలు,

గంగారంలో నూతన ఎంఎస్ఎఫ్ గ్రామ కమిటీ ఎన్నిక

నూతన కమిటీ అధ్యక్షుడిగా రాయికుంట చరణ్

మహేశ్వరం, అక్టోబర్ 24,(ప్రజా కలం)

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపట్టిన ఎంఎస్ఎఫ్ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) నూతన కమిటీల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా గంగారం గ్రామంలో మాదిగ విద్యార్థుల చైతన్య సమావేశం



నిర్వహించారు.ఎంఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కో-ఇన్చార్జి ఆదిరాల భరత్ మాదిగ ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, వికారాబాద్ జిల్లా ఇన్చార్జి గట్ట గల ప్రశాంత్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన ఎంఎస్ఎఫ్ గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రాయికుంట చరణ్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా కల్వకోలు మణితేజ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఆదిరాల శ్రీ చరణ్ మాదిగలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎం ఎస్ ఎఫ్ రంగారెడ్డి జిల్లా నాయకులు ఆదిరాల భరత్ కుమార్ మాదిగ మాట్లాడుతూ మాదిగ విద్యార్థుల్లో విద్య, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎం ఎస్ ఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ తొంట జంగన్న, గ్రామస్తులు జామ్ నరేష్ మాదిగ, కల్వకోలు యాదయ్య మాదిగ, గూడెం అరవింద్ మాదిగ, ఆదిరాల ఉదయ్ కిరణ్ మాదిగ, ఆదిరాల కృష్ణ మాదిగ,ఆదిరాల ప్రవీణ్ మాదిగ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట సంజీవనులుగా వైద్యులు నిలవాలి

- వైద్య విద్యార్థులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచన.
- ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘనంగా వైట్‌కోట్ సెర్మనీ
-విద్యార్థులకు వైట్‌కోట్లు అందజేసి అభినందించిన కలెక్టర్, ఎస్పీ మహేష్ బి.గితే

రాజన్న సిరిసిల్ల,
అక్టోబరు 24 (ప్రజా కలం ప్రతినిధి) :



వైద్య విద్యార్థులు చదువు పూర్తిచేసుకుని ఉత్తమ వైద్యులుగా ఎదగడంతోపాటు, నాణ్యమైన వైద్య సేవలందించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సామాజిక బాధ్యతలో భాగంగా పేదలకు ఉచితంగా వైద్య సేవలందించాలని కోరారు.జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శని వారం నిర్వహించిన వైట్‌కోట్ సెర్మనీలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య విద్యార్థులకు వైట్‌కోట్లు అందజేసి అభినందించారు. అనంతరం అతిథుల ను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్యం, విద్యకు సమాజంలో ఎంతో ప్రాధాన్యం ఉందన్నా రు. వైద్య విద్యలో ప్రవేశం పొందేందుకు విద్యార్థులు ఎంతో కష్టపడాల్సి ఉంటుందని, నీట్‌లో అర్హత సాధించి ఈ అవకాశం దక్కించు కుంటా రని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక తల్లిదండ్రుల కృషి, ప్రోత్సాహం ఉంటాయని గుర్తుచేశారు. వైద్యులు గర్భిణులు, చిన్నారులు, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి ఓర్పుతో సేవలందించాలని సూచిం చారు. ఎంచుకున్న వైద్య విభాగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిం చారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించడం ద్వారా ఆత్మసంతృప్తి తోపాటు సమాజానికి మేలు చేసినవా రవుతారని తెలిపారు. విధి నిర్వహణతో పాటు తమ ఆరోగ్యం, ఆహారం పట్ల కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాల, బాలికలు, బాలుర వసతి గృహాల నిర్మాణ పను లను పలుమార్లు పరిశీలించినట్లు కలెక్టర్ తెలిపారు. బాలికల వసతి గృహం ఇప్పటికే వినియోగంలోకి వచ్చిందని పేర్కొన్నా రు. వైద్య కళాశా ల, బాలుర వసతి గృహ నిర్మాణ పను లను వేగవంతం చేసి త్వరలోనే అందు బాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈకార్యక్ర మంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సి పల్ నిర్విష, తహసీల్దార్ మహేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

సర్పంచ్ మద్దెల వనజ స్వామి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 24.

గొడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ మద్దెల వనజ స్వామి బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వారిని ఉన్నత స్థాయికి చేర్చడమే



ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, మధ్యాహ్న భోజనం, దుస్తులు, బూట్ల పంపిణీతో పాటు విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ దుర్గం దీపిక, మధుసూదన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దెల స్వామి, వార్డు సభ్యుడు దుర్గని నరసింహులు, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాలశేఖర్ రెడ్డి, గ్రామ పెద్దలు దుర్గని నల్ల మల్లేష్, ముత్తుల స్వామి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నవంబర్ 6 లోపు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు పూర్తి చేయాలి

కందుకూరులో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం
మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కందుకూరు సర్పంచ్ సరికొండ పాండు



కందుకూరు, అక్టోబర్ 24,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి గారి ఆదేశాలతోలి కందుకూరు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.క్లస్టర్ కు సంబంధించిన బిఎల్ వో ల మీటింగ్ మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కందుకూరు సర్పంచ్ సరికొండ పాండు ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.మీ ఓటు – మీ భవిష్యత్తు అనే నినాదంతో నిర్వహిస్తున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా, అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.నవంబర్ 6వ తేదీలోపు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకోవాలని, అర్హత కలిగిన పట్టభద్రులు ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకూడదని విజ్ఞప్తి చేశారు. ఓటు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ మాజీ మెంబర్ సరికొండ మల్లేష్, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సౌడప్ వెంకటేష్ గౌడ్, బిసి సెల్ అధ్యక్షులు సరికొండ జగన్, రచలూరు సర్పంచ్ తిర్గమళ్ల కృష్ణ, ఐ ఎన్ టి సి యు మండల అధ్యక్షులు గాదె కుమార్, మాజీ ఎంపీటీసీ మూల హన్మంత్ రెడ్డి, నియోజకవర్గ మహిళా జనరల్ సెక్రటరీ అందుగుల ప్రభావతి, సూరసాని రాంరెడ్డి, అనేగోని పాండు గౌడ్, మొహ్మద్ రహీమ్, జపాల బాలరామ్, ఎగ్గిడి కృష్ణ, గోపిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పెరుమాళ్ల శేఖర్, ఉదారి మహేష్, కళ్యాణకర్ నిరంజన్, మంద మహేష్, గాండ్ల నవీన్, దేవా నాయక్, బొక్క రాజా శేఖర్ రెడ్డి, గాదేలా ప్రశాంత్, పాముల కృష్ణ, చిందం శ్రీకాంత్, ఎడ్ల మహేందర్, మొహ్మద్ ఫాయు, పరమేష్, శ్రీనివాస్ గౌడ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ రిపోర్టర్ పుట్టరాజుకు జన్మదిన వేడుకలు.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 24.


రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, నవతెలంగాణ దినపత్రిక రిపోర్టర్ పుట్టరాజు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాల దుర్గాప్రసాద్



ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జర్నలిజం రంగంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పుట్టరాజు కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో జర్నలిజం రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పాల రామగౌడ్, రాయపోల్ సర్పంచ్ రాజు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్, గొల్లపల్లి మహేష్, పుర నర్సింలు, జాఫర్, చందు, కృష్ణ, వెంకట్ గౌడ్, యూసుఫ్, నర్సింగరావు, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా సంగారెడ్డి సాయిబాబా ఆలయ రజతోత్సవాలు

శనివారం జరిగిన శిఖర కుంభాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన నిర్మల జగ్గారెడ్డి
మూడు రోజుల పాటు జరిగిన రజతోత్సవాలు.



సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24(ప్రజా కలం):

పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల సాయిబాబా ఆలయం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రజతోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ పర్యవేక్షణలో, జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సహకారంతో మూడు రోజులపాటు యజ్ఞయాగాదులు, కుంభ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లికి చెందిన నరేష్ పంతులు నేతృత్వంలో 30 మంది వేద పండితులు ఈ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదటి రోజు సుదర్శన యాగం, రెండో రోజు శత కలశాభిషేకం, మూడో రోజు శిఖర కుంభాభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ సాగిన పూజలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మూడో రోజు జరిగిన శిఖర కుంభాభిషేకంలో నిర్మల జగ్గారెడ్డి పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్యులు టీ. కాశప్ప, కేవీ నర్సయ్య, ఎస్. వీరేందర్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సేవా బాటలో గీతం విద్యార్థులు..

- 2026--27 నూతన నాయకత్వ బృందం ప్రమాణ స్వీకారం
-సమాజ సేవకు విద్యార్థుల ప్రతిజ్ఞ..



పటాన్‌చేరు, అక్టోబర్ 24 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు, సమాజ సేవలో చురుకైన భాగస్వాములుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గీతం హైదరాబాద్ విశ్వవిద్యాలయ రోటరాక్ట్ క్లబ్ నూతన నాయకత్వ బృందం బాధ్యతలు చేపట్టింది. 2026--27 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో విద్యార్థులు సామాజిక సేవకు అంకితభావంతో ముందుకు సాగాలని ప్రముఖులు పిలుపునిచ్చారు. జిల్లా రోటరాక్ట్ ఛైర్మన్ డాక్టర్ జి.ఎస్.ఎస్. ప్రకాష్, రొటేరియన్ జె. యోగేశ్వర్ రెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో దీప ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. నూతన సభ్యుల చేరికతో పాటు నాయకత్వ బృందం ప్రమాణ స్వీకారం, బాధ్యతల అప్పగింత, పాలక మండలి సభ్యులకు గుర్తింపు చిహ్నాల ప్రదానం, వార్షిక ప్రణాళిక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఐరిస్ హైదరాబాద్ రోటరీ క్లబ్ సహకారంతో గీతం రోటరాక్ట్ క్లబ్ విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవ, జట్టు స్ఫూర్తి, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు కృషి చేస్తోంది. స్వార్థం కన్నా సేవ మిన్న అనే నినాదంతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను విస్తృతం చేయాలని క్లబ్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో గీతం నివాస ప్రాంగణ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం, ప్రాంగణ జీవన డైరెక్టర్ అంబికా ఫిలిప్, ఇతర ప్రముఖులు, రోటరీ, రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు. నూతన నాయకత్వ బృందం విద్యార్థుల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమైంది..

శబరిమల యాత్రకు లక్ష సాయం

- అయ్యప్ప స్వాముల మహాపాదయాత్ర ప్రారంభించిన నందారం నరసింహ గౌడ్..

పటాన్‌చెరు, అక్టోబర్ 24 (ప్రజా కలం) ప్రతినిధి

అయ్యప్ప స్వాముల శబరిమల మహాపాదయాత్రకు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షుడు నందారం నరసింహ గౌడ్ లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించి భక్తి చాటుకున్నారు. కిష్టారెడ్డిపేట దుర్గామాత ఆలయం నుంచి కేరళలోని శబరిమల వరకు చేపట్టిన మూడో మహాపాదయాత్రను శనివారం ఉదయం ఆయన ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహ గౌడ్ మాట్లాడుతూ, 40 రోజులకు పైగా ఎండ, వానలను లెక్కచేయకుండా కఠిన నియమాలతో కాలినడకన సాగే ఈ యాత్రకు మణికంఠుడి ఆశీస్సులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాముల యాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగి, భక్తులంతా క్షేమంగా శబరిమల చేరుకుని స్వామివారి దర్శనం చేసుకోవాలని ఆకాంక్షించారు. లోక కల్యాణం కోసం భక్తులు చేపట్టిన ఈ మహాసంకల్పం విజయవంతం కావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, నాయకులు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో కిష్టారెడ్డిపేట పరిసరాలు మార్మోగాయి..



చిన్నారుల క్యాన్సర్‌కు ఆధునిక చికిత్సలు

గాంధీ ఆస్పత్రిలో పీడియాట్రిక్ ట్యూమర్లపై అవగాహన సదస్సు

హైదరాబాద్ (ప్రజాకలం): క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఆధునిక వైద్య చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయని గాంధీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్ కణితుల నిర్ధారణ, చికిత్సలో నూతన వైద్య విధానాలపై



అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

గాంధీ ఆస్పత్రి చిన్నపిల్లల శస్త్రచికిత్స విభాగం ఆధ్వర్యంలో 'ఇన్‌సైట్స్ ఇన్‌టు డిసెక్షన్ ఆఫ్ పీడియాట్రిక్ ట్యూమర్స్' అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె. రమేశ్‌రెడ్డి, గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ఇందిర, చిన్నపిల్లల శస్త్రచికిత్స విభాగ మాజీ ప్రొఫెసర్, విభాగాధిపతులు డాక్టర్ సి.ఎన్. ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ కె. నాగార్జునతో కలిసి ప్రారంభించారు.

చిన్నారుల్లో క్యాన్సర్ కణితుల జీవశాస్త్రం, జన్యుపరమైన అంశాలు, ఆధునిక చికిత్సా విధానాలు, నిర్ధారణ పద్ధతులు, శస్త్రచికిత్సలో ఎదురయ్యే సవాళ్లపై నిపుణులు చర్చించారు. సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ శాస్త్రవేత్త డాక్టర్ వి. రాధా కణితుల జీవశాస్త్రం, జన్యుపరమైన అంశాలను వివరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన డాక్టర్ సాయి బాలాజీ క్యాన్సర్ చికిత్సలో నూతన ఔషధాలు, లక్ష్యిత చికిత్సా విధానాలపై వివరించారు.

పిల్లల క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మ సాగరిక కణితుల నిర్ధారణలో ట్యూమర్ మార్కర్లు, నాన్ ఇన్వేసివ్ పరీక్షల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్రిత్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ హబీబా, డాక్టర్ సాజిద్, డాక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్

- నవంబర్ 6లోగా అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మల్లేష్ యాదవ్ పిలుపు



మహేశ్వరం, అక్టోబర్ 24, (ప్రజా కలం)

మహేశ్వరం మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వట్టేలా మల్లేష్ యాదవ్ కోరారు.నవంబర్ 6తో పట్టభద్రుల ఓటరు నమోదు గడువు ముగియనున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో అవగాహన కల్పించి, 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ వట్టేలా మల్లేష్ యాదవ్ అధ్యక్షతన బీఎల్ఏలు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. నవంబర్ 6తో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ ముగియనున్నందున మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించాలని సూచించారు.2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరు నమోదుకు అర్హులైతే, వారందరికీ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని కోరారు. గ్రామ సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ అర్హులను వీలైనంత త్వరగా గుర్తించి ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తున్నట్లు మల్లేష్ యాదవ్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన నాయకుడికి అవకాశం కల్పించే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదుకు కృషి చేయడంతో పాటు ఎన్నికల ప్రక్రియలో పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, ఉప్పుగడ్డ తండా సర్పంచ్, మహేశ్వరం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య, కాకి ఈశ్వర్, గోపాల్ నాయక్, ఆవుల యాదయ్య, ప్రశాంత్ రెడ్డి, వర్కల యాదయ్య, కూన యాదయ్య, అల్లే కుమార్, కిష్టా నాయక్, భాస్కర్ నాయక్, కె. రమేష్, నర్సింహా యాదవ్, లాజర్, సంగారెడ్డి, పాండు తదితర నాయకులు, వివిధ గ్రామాల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

- గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదుపై దిశానిర్దేశం

- సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతు

- మహేశ్వరం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్



మహేశ్వరం, అక్టోబర్ 23, (ప్రజా కలం)

మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్ అధ్యక్షతన బి ఎల్ ఏ లు ముఖ్య నాయకుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ, మహేశ్వరం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియను వివరించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.పార్టీ కోసం కష్టపడే వ్యక్తికి న్యాయం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ధన్యవాదాలు తెలిపారు.సామ రామ్మోహన్ రెడ్డి విద్యావంతులు, యువకులు అన్ని రంగాలలో జ్ఞానం కలిగిన వ్యక్తి అని, ఆయనను గెలిపించుకోవడం కోసం ప్రతి గ్రామంలో అత్యధికంగా గ్రాడ్యుయేట్ ఓటర్లను నమోదు చేయాలని ప్రతి గ్రామ సర్పంచులు, గ్రామ అధ్యక్షులు బి ఎల్ ఏ లకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ యాదయ్య, కాకి ఈశ్వర్, గోపాల్ నాయక్, ఆవుల యాదయ్య, ప్రశాంత్ రెడ్డి, వర్కాల యాదయ్య, కూన యాదయ్య, అల్లే కుమార్, కిష్టా నాయక్, భాస్కర్ నాయక్, రమేష్, నర్సింహ యాదవ్, లాజర్, సంగారెడ్డి పాండు, వివిధ గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చేగుంట, నార్సింగి అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వినతి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 24.

దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని చేగుంట, నార్సింగి మండలాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కోరారు. ఈ మేరకు రెండు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కలెక్టర్‌ను కలిసి ఆయా గ్రామాల్లోని సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ భవనాలు, మహిళా సమాఖ్య భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణంతోపాటు సీసీ రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చేగుంట, నార్సింగి మండలాల్లో కలెక్టర్ స్వయంగా పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై



కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రెండు మండలాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధుల మంజూరుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరంగాతో ట్యాంక్‌బండ్‌పై మానవహారం

- 'ఎస్ఐఆర్'ను తక్షణమే రద్దు చేయాలి

- ఓటు హక్కు, ఎన్నికల నిష్పాక్షికతను పునరుద్ధరించాలి

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి

-'ఓట్ బచావో.. దేశ్ బచావో' అంటూ సామూహిక ప్రతిజ్ఞ



హైదరాబాద్, అక్టోబరు 24 (ప్రజాకలం): లక్షలాది మంది పౌరుల ప్రజాస్వామిక ఓటు హక్కులను పరిరక్షించేందుకు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, తొలగించిన ఓటర్లందరి పేర్లను వెంటనే ఓటర్ల జాబితాలో పునరుద్ధరించాలని కోరుతూ శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై మానవహారం నిర్వహించారు.

పౌర సమాజ, మానవ హక్కులు, రైతు, దళిత, యువజన, విద్యార్థి సంఘాలతో కూడిన విస్తృత వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు వెయ్యి మంది పాల్గొని త్రివర్ణ పతాకాలను చేతబూని ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఎస్ఐఆర్ హఠా వో.. దేశ్ బచావో", "ఓట్ బచావో.. దేశ్ బచావో" అంటూ ట్యాంక్‌బండ్ పరిసరాలు మార్మోగాయి.

జంతర్‌మంతర్‌ను ఎందుకు రద్దు చేశారు?

ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామిక హక్కుల కోసం నిరసన తెలిపే వేదికగా జంతర్‌మంతర్ ఉండేదని, దానిని ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అత్యంత కీలకమని అన్నారు. ప్రజల గొంతును అణచివేసే చర్యలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

ఎన్నికలు ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైనవని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఎన్నికల కమిషన్ ఎన్నికలను నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. "న్యాయంగా ఎన్నికలు జరగాలన్నదే మా ప్రధాన డిమాండ్" అని పేర్కొన్నారు.

బతికున్న వారి ఓట్లు తొలగించొద్దు

మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ విదేశీయులు, మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడాన్ని తాము వ్యతిరేకించడం లేదన్నారు. అయితే బతికి ఉన్న పౌరుల ఓట్లను తొలగించే ప్రక్రియను మాత్రం వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. "దొంగ ఓట్ల పేరుతో ఉన్న ఓట్లను ఎందుకు తొలగిస్తున్నారు?" అని ప్రశ్నించారు.

'సామూహిక ఓటర్ల తొలగింపు'

ఎస్ఐఆర్ ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియ కాదని, సామూహిక ఓటర్ల తొలగింపునకు దారితీసే ప్రక్రియగా మారిందని నిర్వాహకులు ఆరోపించారు. దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగించబడ్డాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఇప్పటికే 73 లక్షల మంది పేర్లు తొలగించారని, మరో 93 లక్షల మందికి 'అనుమానాస్పద' ఓటర్లుగా నోటీసులు అందుతున్నాయని తెలిపారు.

ఇలాంటి పరిస్థితుల్లో దాదాపు సగం మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించే అవకాశం ఉన్న ఎస్ఐఆర్ ప్రక్రియ ఉద్దేశం, ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు.

ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సిన ప్రజాస్వామ్యంలో.. ప్రభుత్వమే ఓటర్లను ఎంచుకునే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు.

'సీఈసీ చట్టం-2023 రద్దు చేయాలి'

కేంద్ర ఎన్నికల సంఘం నియామకాల్లో నిష్పాక్షికతకు సీఈసీ చట్టం-2023 విఘాతం కలిగిస్తోందని వక్తలు ఆరోపించారు. ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కోరారు.

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతను కాపాడేందుకు ప్రజలు పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కని స్పష్టం చేశారు.

అన్ని జిల్లాల్లో ఉద్యమం

హైదరాబాద్, తెలంగాణలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే పలు నిరసనలు చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. మహిళలు, శ్రామిక పేదలు, మైనారిటీలు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు, అధిక పనిభారంతో సతమతమవుతున్న బీఎల్ఓలు సైతం ఈ ప్రక్రియతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఎస్ఐఆర్ రద్దయ్యే వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్, తెలంగాణలో ఓటర్ల తొలగింపునకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను బాటసారులకు పంపిణీ చేశారు.

పలువురు ప్రముఖుల హాజరు

మానవహారంలో ప్రొఫెసర్ హరగోపాల్, పరకాల ప్రభాకర్, పర్యావరణవేత్త శాంతాసిన్హా, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, వసంతలక్ష్మి, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ పద్మజా షా, కల్పనా కన్నభిరాన్, రుబీనా నఫీస్, రవి కన్నెగంటి, సౌమ్య కిదాంబి, సజయ కాకర్ల, ఝాన్సీ, సంధ్య, సిస్టర్ లిస్సీ, కిరణ్ విస్సా, మారియా తబస్సుమ్, పి.శంకర్, సునీత ఎ., మేరీ డయాస్, వెంకట్‌రెడ్డి, ఖలీదా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో 'ఓట్ బచావో.. దేశ్ బచావో' అంటూ పాల్గొన్నవారు సామూహిక ప్రతిజ్ఞ చేశారు.

కోంపల్లి జయభేరి పార్క్‌లో హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కోంపల్లి జయభేరి పార్క్‌లో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది.మేడ్చల్ జిల్లా, కోంపల్లి, జయభేరి పార్క్‌లోని సాయి నిలయం ఫ్లాట్ నంబర్ 101లో నివాసం ఉంటున్న సొంటానా కృష్ణారావు, హెడ్ కానిస్టేబుల్ -5996, బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 24న మధ్యాహ్నం సుమారు 12:00 గంటల సమయంలో విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతూ స్నానం చేసిన అనంతరం తన బెడ్‌రూమ్‌లోకి వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్నారు. కొద్దిసేపటి తర్వాత ఆయన భార్య భోజనం చేయడానికి పిలిచినప్పటికీ స్పందించకపోవడంతో, తలుపు తట్టి పిలిచినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆమె బెడ్‌రూమ్ తలుపు తెరిచి చూడగా, తన భర్త మంచంపై కదలికలు లేకుండా పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే ల్యాబ్ టెక్నీషియన్ బిక్షాలు సహాయంతో డాక్టర్ చరణ్‌ను సంప్రదించగా, ఆయన పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో సమీపంలోని విజేత హాస్పిటల్‌కు తరలించగా, అక్కడి వైద్యులు కూడా అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుడు గతంలో ఛాతినొప్పితో బాధపడుతూ వెల్‌నెస్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు భార్య తెలిపారు. ఈఘటనపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, తదుపరి విచారణ చెప్పట్టిన్నట్లు పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు.



పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బడంగ్ పేట్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏల సమావేశం

డివిజన్ అధ్యక్షులు బంగారి అశోక్

మహేశ్వరం,అక్టోబర్ 24,(ప్రజా కలం): మహబూబ్ నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బడంగ్ పేట్ 61వ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు.మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి కె ఎల్ ఆర్ ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షులు బంగారి అశోక్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు బంగారి అశోక్ మాట్లాడుతూ... బడంగ్ పేట్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో ప్రతి ఇంటికి వెళ్లి పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని నాయకులకు, బీఎల్ఏ లకు సూచించారు.అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాబోయే మహబూబ్ నగర్ రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి ని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో రజక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బంగారు బాబు, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్ల శ్రీనివాస్, గట్టు బాలకృష్ణ, సుదర్శన్ రెడ్డి (బాబు), విజయ్, యాతం కుమార్, వరుణ్ రెడ్డి, నాయనా చారి, లక్ష్మి శెట్టి మనోహర్, మహిళా నాయకురాలు అమృతా నాయుడు, సాయి, రఘువీర్ ప్రసాద్, శివకుమార్, భాను ప్రసాద్, జంపయ్య, శ్రీకాంత్, జావేద్, శ్రీను, మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్యకు సముచిత గౌరవం

ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటుపై హర్షం

మామునూరు విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలి

- సోము రమేష్ కురుమ

బీబీనగర్, అక్టోబర్ 24 (ప్రజాకలం): తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో తొలి అమరుడిగా గుర్తింపు పొందిన దొడ్డి కొమురయ్యకు మరింత సముచిత గౌరవం దక్కాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ కోరారు.



హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. నాటి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని రమేష్ కురుమ పేర్కొన్నారు. ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలనే నిర్ణయం పోరాట యోధుల చరిత్రకు గుర్తింపునివ్వడంతోపాటు, బీసీ, బహుజన వర్గాల ఆత్మగౌరవాన్ని చాటుతుందని అన్నారు. వరంగల్‌లో నిర్మిస్తున్న మామునూరు విమానాశ్రయానికి కూడా దొడ్డి కొమురయ్య కురుమ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిర్ణయం అమరుడి సేవలను భావితరాలకు పరిచయం చేయడంతోపాటు, ఆయన పోరాట స్ఫూర్తిని చిరస్థాయిగా నిలుపుతుందని అభిప్రాయపడ్డారు. విగ్రహ ఏర్పాటును త్వరగా పూర్తి చేసి, విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టే ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించాలని సోము రమేష్ కురుమ విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రూ.20 వేల సాయం అందించిన

మాజీ ఎంపీపీ యర్కల సుధాకర్ గౌడ్

బీబీనగర్, అక్టోబర్ 24 (ప్రజాకలం): మండలంలోని రాయరావుపేట గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు బండారి నర్సింహా ఇటీవల



మృతి చెందడంతో శనివారం ఆయన కుటుంబాన్ని బీబీనగర్ మాజీ ఎంపీపీ యర్కల సుధాకర్ గౌడ్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి ఆర్థిక ఇబ్బందులకు అండగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిన్నాల వెంకటేష్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు నాశబోయిన సాయి ముదిరాజ్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరుకల సుమన్ గౌడ్, వార్డు సభ్యులు పండాల వేదన శ్రీహరి, బొర్ర సత్యలక్ష్మి, వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు రొంపి సత్యనారాయణ, చిన్నాల నర్సింహా, ఎరుకల నాగరాజు గౌడ్, కుకూట్ల రమేష్, ఎర్రబెల్లి జంగయ్య, ముసిరిగొని రాజు, రొంపి భిక్షపతి, బండారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్ఓసీ అందజేత

వైద్య చికిత్సకు రూ.4.50 లక్షల సాయం

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చొరవ

బీబీనగర్, అక్టోబర్ 24 (ప్రజాకలం): అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని రాయరావుపేట గ్రామానికి చెందిన గడమిద్ది సత్యనారాయణకు వైద్య చికిత్స నిమిత్తం రూ.4.50 లక్షల ఎల్ఓసీని శనివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. బాధితుడి వైద్య ఖర్చులకు ఆర్థిక భరోసా కల్పించేలా ఈ సహాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొర్ర రమేష్ మాట్లాడుతూ.. బాధితుడి పరిస్థితిని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎరుకల శివనాగరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ రంగోల శ్రీనివాస్, వార్డు సభ్యులు తిప్పురబోయిన జంగమ్మ జంగయ్య, ఎర్రబెల్లి ప్రకాష్, రొంపి ఆనంద్, గ్రామ పెద్దలు గడ్డమీది కృష్ణ, గడ్డమీది సత్యనారాయణ, గడ్డమీది వేణు తదితరులు పాల్గొన్నారు.



బీబీనగర్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్



బీబీనగర్, అక్టోబర్ 24 (ప్రజాకలం): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ వరిస్థితులు ఏర్పడి వంటలు ఎండిపోతున్న నేపథ్యంలో బీబీనగర్ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జమీలపేట గ్రామంలో సీపీఎం నాయకులు వరి పొలాలను పరిశీలించి వంటల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం, విద్యుత్తు కోతలతో వంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెట్టిన పెట్టుబడులు చేతికందే పరిస్థితి లేక ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటనలు, సూచనలకే పరిమితం కాకుండా కరువు నివారణ చర్యలు చేపట్టి, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. రానున్న యాసంగి సీజన్‌లో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత పెంచేందుకు అవసరమైన నిధులు కేటాయించి సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలని కోరారు. శామీర్‌పేట చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి గోదావరి జలాలను మళ్లించే ప్రతిపాదనకు నిధులు కేటాయించాలని, తద్వారా బీబీనగర్, బొమ్మలరామారం మండలాలతోపాటు మేడ్చల్ జిల్లాలోని కీసర, ఘట్‌కేసర్ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలకు స్వస్తి పలికి కరువు ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న రైతులను, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రేసు రామచంద్రారెడ్డి, మండల నాయకుడు బండారు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు చినాల బాలయ్య, ఎర్రనోళ్ల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బిజెపి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా

చలో హైదరాబాద్ ను జయప్రదం చెయ్యండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్




ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర బిజెపి, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 25 26వ తారీకుల్లో ఇందిరాపార్కు వద్ద జరిగే 48 గంటల మహాధర్నాను జయప్రదం చేయాలని షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. మల్లికార్జున్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, మండల కన్వీనర్ కీలుకానీ లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు రెండు కోట్ల మంది సంఘటిత అసంఘటిత కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఈకార్మిక వర్గం కదంతో క్యాల్సిన తరుణం ఆసన్నమైందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఏర్పడిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దేశ సంపదను కార్మికుల శ్రమను కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ మన హక్కులను కాలరాస్తున్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు తెచ్చింది.

ఈ నాలుగు లేబర్ కోడ్లు కార్మికులను కట్టు బానిసలుగా చేసేవి ఈ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రభుత్వానికి గుండెకాయ లాగా పనిచేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తుందనిన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం మన అందరి హక్కు అన్నారు కనీన వేతనాల పెరుగుదల కనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచకుండా కార్మికుల శ్రమను దోచుకోవడానికి పెట్టుబడుదారి వర్గానికి స్వేచ్ఛనిచ్చింది, కేంద్ర కనీన వేతనాల సలహాల మండలిలో కార్మిక హక్కుల కోసం పోరాడే కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా ప్రభుత్వాల కనుకూలంగా వంతపాడే కార్మిక సంఘాలకు అవకాశం కల్పించి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశాలు జరపడం లేదు.

స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదు 12 సంవత్సరాలలో 25 లక్షల కోట్ల ప్రజాధనాన్ని బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు దార పోసి కార్మిక ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక ప్రజా సమస్యల పరిష్కరించడంలో బిజెపి అడుగుజాడల్లో నడుస్తున్నది. నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకించకుండా వాటిని రూల్స్ రూపొందించి అమలు చేయాలని, రాష్ట్రంలో స్టాప్ ఎస్టాబ్లిషెన్ లేబర్ యాక్ట్ పరిధిలోని సంస్థల్లో 10 గంటల పని విధానం తెచ్చింది. ఈ GO ను కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చ చేయకుండా జీవో విడుదల చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సి లేదు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ మాట లేదు, స్క్రీమ్ వర్కర్లు అంగన్వాడీ ఆశ, మధ్యాహ్న భోజనం వీళ్ళ జీతాల పెంపు మాట లేదు రాష్ట్రంలో కార్మిక వర్గానికి అన్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది. జీవో నెంబర్ 6 ని విడుదల చేసింది. కానీ జీవో నెంబర్ 6 ను అమలు చేయని యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఏ యాజమాన్యం కూడా జీవో నెంబర్ 6 ని అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను పట్టించు కోవడంలో పూర్తిగా విఫలమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమానంగా పనిచేస్తున్న ఫిక్స్ నాన్ రెగ్యులర్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు స్కీం వర్కర్లకు కూడా డిఏ అమలు చేయాలి, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రతను కల్పించాలి. కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుండి 58 సంవత్సరాలు దాటినా ప్రతి కార్మికునికి నెలకు పెంక్షన్ పదివేల రూపాయలు ఇవ్వాలని స్కీం వర్కర్లపై రోజురోజుకీ పని భారం పెరుగుతుంది, అధికారుల వేధింపులు ఎక్కువైపోతున్నాయి. ప్రభుత్వ నంక్షేమ వధకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆయుధంగా పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం కోసం ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు అధిక మొత్తంలో కార్మికవర్గం అంతా జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు జీడిమెట్ల క్లస్టర్ కన్వీనర్ పి. అంజయ్య, మండల నాయకులు శ్రీను, దేవదానం, శ్రీశైలం, ఆంజనేయులు, గోపి మధు, యాదవరెడ్డి, మల్లారెడ్డి, దుర్గా నాయక్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



తోటకూర వజ్రేష్ యాదవ్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన బండారి రవీందర్

మేడిపల్లి అక్టోబర్ 24(ప్రజాకలం న్యూస్)

విజయదశమి దసరా పండగ సందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ బండారి రవీందర్,మాజీ కార్పొరేటర్లు, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ నేతలు,మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ను శనివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో రాజకీయ రంగంలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని బండారి రవీందర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఎంపల్ల అనంతరెడ్డి, సుభాష్ నాయక్, నాయకులు బొడిగె కృష్ణగౌడ్, యాచారం మహేష్, దంతూరి వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించండి

వాటర్ వర్క్స్ అధికారులకు సిపిఐ వినతి పత్రం.

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)ఎల్నీనో కారణంగా రాబోవు రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది కాబట్టి ప్రజలను అప్రమత్తత చేయడానికి, నీటి వృధాను అరికట్టడానికి వాటర్ వర్క్స్ అధికారులు అన్ని బస్తీలలో పర్యటించి ప్రజలను చైతన్యపరిచి నీటిని వృధా చేయకుండా చూడాలని శనివారం సిపిఐ ఆధ్వర్యంలో చింతల్ సర్కిల్ వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వికాస్ కి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ.... బస్తీలలో మంచినీరు సరఫరా చేసే సమయంలో అధికారులు పర్యటించి ఎవరైతే నీరు వృధా చేస్తున్నారో వారికి జరిమానా విధిస్తే నీటిని వృధా చేసే మిగతా ప్రజలు భయపడి నీటిని వృధా చేయకుండా ఉంటారని అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అనేకసార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారని, నీటి వృధానీ అరికట్టాల్సిన వాటర్ వర్క్స్ అధికారులు అధికారులు కూడా ప్రకటనలకే పరిమితమైతే సరిపోదని వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు మొదలుపెట్టాలన్నారు. అదేవిధంగా అక్రమంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సిపిఐ నాయకులు గిరినగర్, జగద్గిరిగుట్టలో వివిధ ప్రాంతాల్లో వివిధ బస్తీల్లో ఎక్కడెక్కడ నీరు వృధాగా పోతుందో వాటి వివరాలను వాటర్ వర్క్స్ అధికారులకు ఇవ్వడం జరిగింది. వారం రోజుల్లోపు సిపిఐ ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్ సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, శాఖ కార్యదర్శి వెంకటేష్, యాకూబ్, సిపిఐ నాయకులు ఇమామ్ యాదన్న, సాగర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పోతర్ల సుదర్శన్ యాదవ్

మహేశ్వరం, అక్టోబర్ 24, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పోతర్ల సుదర్శన్ యాదవ్ గారు మరో ప్రతిష్టాత్మక బాధ్యతను చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వే (సౌత్ సెంట్రల్ రైల్వే) సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా ఎన్నికై నూతన బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన పోతర్ల సుదర్శన్ యాదవ్ కి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సుదర్శన్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి మునవత్ పాండు నాయక్ , మండల అధ్యక్షులు తెల్గామల్ల యాదిష్ , ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్ ఉపేందర్, మహేశ్వరం మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య, మండల కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు చిందం జంగయ్య, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి,ఆకుల నరేష్, సందుల గణేష్, మునవత్ రమేష్, జెరుపుల రమేష్, బూత్ అధ్యక్షులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కేబీఆర్ పార్క్ చుట్టూ పనులు వేగవంతం చేయండి

- అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాలు

- ఎలివేటెడ్ కారిడార్ పనులపై సమీక్ష..

యుటిలిటీల తరలింపునకు సమన్వయం

హైదరాబాద్, అక్టోబరు 24 (ప్రజాకలం): కేబీఆర్ పార్క్ చుట్టూ చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం కేబీఆర్ పార్క్ పరిసరాల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సీనియర్ అధికారులతో కలిసి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు.

4.3 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు సిగ్నల్ రహిత రాకపోకలకు చేపడుతున్న 4.3 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులపై కమిషనర్ ఆరా తీశారు. పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా వేగం పెంచాలని అధికారులకు సూచించారు.

వన్‌వే ట్రాఫిక్‌కు ఏర్పాట్లు

కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని కర్ణన్ ఆదేశించారు. కేబీఆర్ పార్క్ ప్రధాన ప్రవేశ ద్వారం, అగర్సేన్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద చేపడుతున్న అప్‌గ్రేడేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

యుటిలిటీల తరలింపుపై దృష్టి

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ఉన్న యుటిలిటీలను తరలించేందుకు టీజీఎస్పీడీసీఎల్‌తో తక్షణమే సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఫౌండేషన్ పనులకు వేగం

ముగ్ధ జంక్షన్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు మార్గంలో ఫౌండేషన్ డిజైన్ పరిశోధనలను వేగవంతం చేయాలని కర్ణన్ సూచించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్--ముగ్ధ జంక్షన్ మధ్య ఫౌండేషన్ తవ్వకాలు, ఆఫ్‌సైట్ స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులను సైతం మరింత వేగంగా చేపట్టాలని ఆదేశించారు. పనులన్నింటినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు కమిషనర్ సూచించారు.



మంత్రి పొన్నం సభలో

ప్రొటోకాల్ రగడ

స్థానిక ఎంపి ఎమ్మెల్యే,ఫోటో లేకపోవడంపై రాజుకున్న రగడ..

పీర్జాదిగూడ సిటీబస్ టెర్మినల్ ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన...

మంత్రి పొన్నం క్షమాపణతో సద్దుమణిగిన గొడవ...



మేడ్చల్/మేడిపల్లి

అక్టోబర్ 24(ప్రజాకలం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అధికారిక అభివృద్ధిలో భాగమైన సిటీ బస్ టెర్మినల్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం తలెత్తింది.వివరాల్లోకి వెళ్తే మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని పీర్జాదిగూడలో మూడుకోట్ల రూపాయలతో ప్రభుత్వం నూతనంగా నిర్మించతలపెట్టిన సిటీబస్ టెర్మినల్ నిర్మాణానికి మంత్రి పొన్నం భూమిపూజ చేశారు.ఇందుకు సంబంధించిన వేదికపై మేడ్చల్ ఎమ్మెల్యే,మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి ఫోటోలు లేకపోవడంపై పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు.అధికారిక కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ ఫోటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.ఈ క్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కలగజేసుకొని మల్లారెడ్డికి క్షమాపణ చెప్పానని, ఇంకోసారి ఇలాంటి పొరపాటు జరగకుండా చర్యలు తీసుకుంటామని కోరారు. అధికారులు మళ్ళీ ఇలాంటి పొరపాట్లను పునరావృతం చేయవద్దని సూచించారు. మల్లారెడ్డి సూచనల మేరకు బీఆర్ఎస్ శ్రేణుల గొడవ సద్దుమణిగింది. ఆందోళనలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి,కొల్తూరి మహేష్,కవిడే పోషయ్య, బీఆర్ఎస్ పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల, సీనియర్ నాయకులు జావీద్ ఖాన్,ఆకుల మధుకర్,శ్యామల శ్రీనివాస్, మైనార్టీ నాయకులు పాషా, కల్యాణి,సంధ్య, వివిధ డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలి

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం అక్టోబర్ 24 (ప్రజా కలం)

రంగారెడ్డి--మహబూబ్‌నగర్--హైదరాబాద్ నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్



నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి సూచించారు.శనివారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహేశ్వరం నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్‌చార్జి శ్రీమతి సురభి వాణీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం.

కొత్త పింఛన్లు ఎక్కడ? అర్హులైన పేదలకు సమాధానం చెప్పాలి.

విద్యుత్ కోతలతో రైతుల ఇబ్బందులు పట్టవా?.

పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ రఘునందన్ రావు.



దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 24.

ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. శనివారం రాయపోల్ మండలంలోని ఎల్కల్, వడ్డేపల్లి, వీరారెడ్డిపల్లి, వీరానగర్, కొత్తపల్లి, కృష్ణసాగర్, ఆరెపల్లి గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి తోనే దేశాభివృద్ధి సాధ్యమని, కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. దసరాలోపు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయకపోవడంపై ప్రశ్నించారు. పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అర్హులైన పేదలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో రైతుల ఇక్కట్లు గ్రామాల్లో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రఘునందన్‌రావు అన్నారు. సకాలంలో విద్యుత్ సరఫరా కాక పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించి, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు వెంకటయ్య, రేణుక రాజాగౌడ్, సుగుణ, రొయ్యల శ్రీను, శశికాంత్, శ్యామల మల్లేశం, దివ్య కృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్, మండల అధ్యక్షుడు మంకిడి స్వామి, మాజీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, ఉపసర్పంచ్ వీరేష్, నాయకులు విభీషణ్‌రెడ్డి, రాజిరెడ్డి, నీల స్వామి, గజ్వేల్ రామచంద్రం, భూపాల్‌రెడ్డి, నరేష్‌గౌడ్, గణేష్, లక్ష్మణ్, చందు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

దళిత విభాగాన్ని మరింత అభివృద్ధి చేయాలి

- ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ మధుయాష్కీ గౌడ్

-రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్

మహేశ్వరం, అక్టోబర్ 24,(ప్రజా కలం)

ఏఐపీసీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ మధుయాష్కీ గౌడ్ ఉత్తర్వుల మేరకు హయత్ నగర్ లోని క్యాంప్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు.రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రంగారెడ్డి జిల్లా కమిటీ, నియోజకవర్గ, డివిజన్ చైర్మన్లకు నియామక పత్రాలను అందజేశారు. దళిత విభాగాన్ని మరింత అభివృద్ధి చేసి పార్టీని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ గారు పిలుపునిచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గ చైర్మన్ గా ఊరిపక్క రవి, జిల్లా వైస్ చైర్మన్ గా – పోగుల నరసింహ



ప్రధాన కార్యదర్శిగా – పెద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా – జరిగే నరేష్, నాగోల్ డివిజన్ చైర్మన్ గా – కాటపాక బాలు ఈ ఎస్ ఐ డివిజన్ చైర్మన్ గా – పంగ గౌతం మన్సూరాబాద్ డివిజన్ చైర్మన్ గా – ప్రశాంత్ లెక్చరర్ కాలనీ డివిజన్ చైర్మన్ గా – నాగరాజు, సాహెబ్ నగర్ డివిజన్ చైర్మన్ గా – భవాని సరస్వతి, చింతలకుంట డివిజన్ చైర్మన్ గా – బాలకృష్ణ, హస్తినాపురం డివిజన్ చైర్మన్ గా – షాగ శ్రీనివాస్ (దర్గా) గడ్డి అన్నారం డివిజన్ చైర్మన్ గా – అనసూయ శాంతి, చైతన్యపురి డివిజన్ చైర్మన్ గా – మేకల కృష్ణ, కొత్తపేట డివిజన్ చైర్మన్ గా – కవాసాలా మహేష్, లింగోజిగూడ డివిజన్ చైర్మన్ గా – కప్పరి శ్రీనివాస్, కర్మన్ ఘాట్ డివిజన్ చైర్మన్ గా గడ్డం వెంకటేష్ ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ కమిటీ సభ్యులు కొంకణి విజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ నందిగామ నరసింహ, నందిగామ తదితరులు పాల్గొన్నారు.

దసరా వేళ హరీష్ రావుతో బీఆర్ఎస్ నాయకుల భేటీ

- గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఇంద్రేశం, -ఇస్నాపూర్ బీఆర్ఎస్ నాయకులు..

పటాన్‌చేరు, అక్టోబర్ 24 (ప్రజా కలం) ప్రతినిధి

దసరా పండుగ సందర్భంగా మాజీ మంత్రి, సిద్ధిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్ రావును పటాన్‌చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెండు మున్సిపాలిటీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ప్రజలు నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్లు సుమలత శ్రీకాంత్, ప్రమీల, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, అంతిరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు..



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ప్రోటోకాల్ పాటించలేదని అభ్యంతరం

సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడంపై అసంతృప్తి

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామ పాలకవర్గం వెల్లడి

మెదక్ అక్టోబర్ 24(ప్రజాకలం ప్రతినిధి): మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రోటోకాల్ పాటించలేదని గ్రామ పాలకవర్గం అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ వెంకట్ గౌడ్(గజిని) ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో పాటు వారికి తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించాలని గ్రామ సర్పంచ్ వెంకట్ గౌడ్ పాలకవర్గం పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులందరినీ సమానంగా గౌరవించాలని, ఒకరి పట్ల ఒక విధంగా, మరొకరి పట్ల మరో విధంగా వ్యవహరించడం సరికాదని వారన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులను కలిసి, గ్రామ పాలకవర్గం తరపున జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉండాలని, భవిష్యత్తులో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించి తగిన ప్రాధాన్యత కల్పించాలని గ్రామ సర్పంచ్ పాలకవర్గం కోరారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com